Follow: @ANNTELUGU
28-09-2026

# మహా పత్రిక

ANN తెలుగు

సోమవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 247 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

టాప్ న్యూస్

## ఏఐతో 100 కోట్ల మంది ప్రాణాలకు ముప్పు



- బిల్‌గేట్స్ సంచలన హెచ్చరిక
- దుష్టశక్తుల చేతిలో ఏఐతో పెను ప్రమాదం

02

## పండగ సీజన్ వేళ ఏసీ, టీవీల రేట్ల షాక్



- అక్టోబర్ 1 నుండి 8శాతం దాకా ధరల పెంపు

02

## దసరాకు రెడీ అవుతున్న ఏపీ విజయవాడ ఉత్సవ్ సీజన్-2



02



# ఉగ్రవాదంపై ఉక్కుపాదం

**భారత్ విధానం 'జీరో టాలరెన్స్'**

**2016 సర్జికల్ స్ట్రైక్స్‌ను గుర్తుచేసిన మోదీ**

- జనగణన జాతీయ బాధ్యత.. ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
- 'మన్ కీ బాత్' 138వ ఎపిసోడ్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

**న్యూఢిల్లీ, మహా :** ఉగ్రవాదంపై రాజీలేని పోరాటం చేస్తున్నామని, ఉగ్రవాద చర్యల పట్ల భారత్ 'జీరో టాలరెన్స్' విధానాన్ని అవలంబిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఆదివారం ఆయన 138వ 'మన్ కీ బాత్' (మనసులోని మాట) కార్యక్రమంలో దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. 2016లో పాక్ ఉగ్రస్థావరాలపై భారత సైన్యం జరిపిన సర్జికల్ స్ట్రైక్స్‌ను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా గుర్తుచేశారు.2016 సెప్టెంబర్ 18న ఉరీలోని ఆర్మీ క్యాంపుపై జరిగిన ఉగ్రదాడికి ప్రతిస్పందనగా, సెప్టెంబర్ 2829 రాత్రి భారత సైన్యం నియంత్రణ రేఖ (ఎల్ఓసీ) దాటి ఉగ్రవాదుల లాంచ్ ప్యాడ్‌లపై సర్జికల్ స్ట్రైక్స్ నిర్వహించిందని మోదీ గుర్తుచేశారు. ఉగ్రవాదానికి మిగతా 2వ పేజీలో



## నేడు, రేపు ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి

**రేపు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం**

**హైదరాబాద్, మహా :** సీఎం రేవంత్ రెడ్డి 2 రోజుల పాటు హస్తినలోనే ఉండనున్నారు. షెడ్యూల్ ప్రకారం.. సోమవారం ఢిల్లీలో ఓ ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. అనంతరం మంగళవారం అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశానికి హాజరుకానున్నారు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలు, భవిష్యత్ కార్యాచరణ, సీఈసీ రాజీనామాపై పోరాటం, అలాగే పలు రాష్ట్రాల్లోని రాజకీయ పరిణామాలపై ఈ సీబ్ల్యూసీ భేటీలో ప్రధానంగా చర్చించనున్నారు. ఈ సమావేశంలో దేశవ్యాప్తంగా ఉన్న సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు, సీనియర్ జాతీయ నేతలు హాజరుకానున్నారు. త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలు, ఉప ఎన్నిక అంశంపై చర్చ జరిగే అవకాశాలున్నాయి

# కౌశిక్.. కడియంకు ఉప గండం



కౌశిక్ పై ఎథిక్స్ కమిటీ చర్యతో అనర్హత ఖాయమంటున్న కాంగ్రెస్ వర్గాలు

దానం లాగే కడియంపైనా నవంబర్ లో తీర్పు వస్తుందంటున్న బీఆర్ఎస్ వర్గాలు

ఖైరతాబాద్ తో మరిన్ని కలిసొస్తాయా? కోర్టుల్లో నేతల భవితవ్యం

**(హైదరాబాద్ మహా):** ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా ఉన్న దానం నాగేందర్ పై అనర్హత వేటుపడడంతో ఉప ఎన్నిక ఖాయమైంది. ఉత్తరప్రదేశ్ తో పాటు త్వరలో జరగనున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతో కలిపి సంక్రాంతి తర్వాత ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఉప ఎన్నిక జరగనుంది. అయితే కాంగ్రెస్ లో చేరిన దానంపై అనర్హత వేటుపడడంతో సహచర ఎమ్మెల్యేను సభలోనే అంతు చూస్తా అంటూ సంకేతాలు పంపారని, నేరుగా సభలోనే బెదిరింపులకు దిగిన హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై అనర్హత వేటువేయాలని కాంగ్రెస్ నేతలు పట్టుబడుతున్నారు. దీనిపై ఎథిక్స్ కమిటీ కూడా సీరియస్ గా ఉంది. చర్య తప్పదని శాసనసభ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇదే జరిగితే హుజూరాబాద్ కు కూడా బైపోల్ జరుగుతుంది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం, కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నపుడు నల్లగొండ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఆలంపూర్ ఎమ్మెల్యే సంపత్ కుమార్ ల సభ్యత్వం కూడా రద్దయినట్లు ప్రకటించి అసెంబ్లీ కార్యదర్శి ద్వారా సీట్లు ఖాళీ అయినట్లు కూడా ఎన్నికల కమిషన్ కు సమాచారం పంపారు. అయితే ఎన్నికలేవీ జరగలేదు. ఈసీ కూడా నోటిఫై చేయలేదు. ఇపుడు మిగతా 2వ పేజీలో



## దసరా కల్లా మెట్రో ఫేజ్-1 స్వాధీనం

**రుణ సమీకరణపై సర్కారు ఫోకస్**

ఎస్‌బీఐ క్యాప్స్ ద్వారా తక్కువ వడ్డీ రుణాల కోసం ప్రయత్నాలు

ఐఆర్ఎఫ్‌సీ రుణం పెండింగ్.. ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి

ఓల్డ్ సిటీ మెట్రో వ్యయం అంచనా పెంపు

**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ మెట్రో ఫేజ్ 1లోని ఎల్ అండ్ టీ సంస్థ వాటాను విజయదశమి నాటికి పూర్తిగా స్వాధీనం చేసుకునేలా ప్రక్రియను వేగవంతం చేయాలని తెలంగాణ ప్రభుత్వం అధికారులకు లక్ష్యం విధించింది. ఈ స్వాధీన ప్రక్రియలో భాగంగా, ఎల్ అండ్ టీ సంస్థ వివిధ బ్యాంకుల నుంచి తీసుకున్న సుమారు రూ. 13,600 కోట్ల రుణాలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది. ఈ రుణ సమీకరణ బాధ్యతను కేంద్ర ప్రభుత్వ సూచన మేరకు ఎస్‌బీఐ క్యాప్స్‌కు అప్పగించారు. ప్రస్తుతం ఉన్న 78% వడ్డీ రేటు కంటే తక్కువ వడ్డీకి రుణాలు సేకరించడం ద్వారా ప్రభుత్వంపై ఆర్థిక భారం మిగతా 2వ పేజీలో



## ఐదు రోజుల పని కోసం మూడు రోజుల సమ్మె

**హైదరాబాద్, మహా :** ఐదు రోజుల బ్యాంకింగ్ విధానం అమలు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో బ్యాంకు ఉద్యోగ సంఘాలు సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల పాటు దేశవ్యాప్తంగా సమ్మె బాట పట్టనున్నారు. కాగా, సమ్మె కారణంగా ప్రజలకు కలిగే ఇబ్బందులను తగ్గించేందుకు ఆదివారం ప్రభుత్వ రంగ మిగతా 2వ పేజీలో

## దర్శిపై కేటీఆర్ ప్రశంసలు

**రుణపడి ఉంటాను రామన్నా అంటూ ప్రియదర్శి ఆనందం**

02



## భద్రాచలం వద్ద ఉగ్రరూపం దాల్చుతున్న గోదావరి

**9 లక్షల క్యూసెక్కులకు చేరనున్న వరద!**

- ఎగువ నుంచి పోటెత్తుతున్న వరద ప్రవాహం
- ప్రభావిత జిల్లాల్లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాల మోహరింపు
- ఉప్పొంగే వాగులు, కాజ్‌వేలు దాటొద్దని అధికారుల హెచ్చరిక
- లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన

02





## రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయం

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**మహా, సూర్యాపేట :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టడం ఖాయమని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీ ప్రధాని కావాలని దేశ ప్రజలు ఎదురుచూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. గత 12 ఏళ్లుగా బీజేపీ పాలకులు ప్రజలను మోసం చేస్తూ ఓట్ల చోరీకి పాల్పడుతున్నారని మంత్రి ఆరోపించారు. మిగతా 2వ పేజీలో

## ఊరువాడా ఉత్సాహంగా అమ్మకు అక్షరమాల

- చదువుకు వయసు అడ్డంకి కాదని చాటిన 6 లక్షల వయోజనులు
- ఉల్లాస్ పరీక్ష రాసిన వయోజనులకు మంత్రి సీతక్క అభినందనలు
- లక్ష్యం చేరే వరకు అక్షరాస్యత ఉద్యమం కొనసాగిస్తాం – మంత్రి సీతక్క
- ఉల్లాస్‌లో ఉత్తీర్ణులైన వారికి పదో తరగతి పరీక్ష రాసే అవకాశం
- అర్హులైన ప్రతి ఒక్కరూ త్వరగా దరఖాస్తు చేసుకోవాలి – మంత్రి సీతక్క

02



## హుస్సేన్‌సాగర్ తీరాన 35 వేల మందితో 'పింక్ పవర్ రన్ 3.0'

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహనకు కదలిన రన్నర్స్

- 21కే హాఫ్ మారథాన్‌కు పలు దేశాల నుంచి రన్నర్లు.. రూ.75 లక్షల నగదు బహుమతులు
- ప్రముఖులు, క్రీడాకారులు, సినీ తారలతో ఉత్సాహభరితంగా మూడో ఎడిషన్

03



### ఏఐతో 100 కోట్ల మంది
# ప్రాణాలకు ముప్పు

**: బిల్‌గేట్స్ సంచలన హెచ్చరిక**
**దుష్టశక్తుల చేతిలో ఏఐతో పెను ప్రమాదం**



**మహా :** మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)పై సంచలన హెచ్చరికలు జారీ చేశారు. దుష్టశక్తుల చేతిలో ఏఐ చిక్కితే అది దాదాపు 100 కోట్ల మంది మరణాలకు దారితీసే పెను విపత్తుకు కారణం కావచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. ఓ అమెరికన్ టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఏఐ స్వయంగా మానవాళిని నాశనం చేస్తుందని తాను భావించడం లేదని గేట్స్ స్పష్టం చేశారు. అయితే, దురుద్దేశాలు ఉన్న వ్యక్తులు ఆధునిక ఏఐ టూల్స్‌ను ఉపయోగించి చేసే సైబర్ దాడులు, జీవాయుధాల (బయో వెపన్స్) ప్రయోగం వంటివి ఊహించని నష్టాన్ని కలిగిస్తాయని వివరించారు. ఈ ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి పరిశ్రమ స్వీయ నియంత్రణ సరిపోదని, ప్రభుత్వాలు కఠినమైన చట్టాలు తీసుకురావాలని ఆయన సూచించారు. వాషింగ్టన్‌లో దీనిపై చట్టం తీసుకురావడం తప్పనిసరి అని, ఇది పరిశ్రమపై కొంత భారం మోపినప్పటికీ, అభివృద్ధిని పెద్దగా నిరోధించదని అన్నారు. ఓపెన్‌ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్, ఆంత్రోపిక్ సీఈవో డారియో అమోడీ వంటి ఇతర టెక్ నిపుణులు కూడా ఏఐ నియంత్రణ ఆవశ్యకతపై గళం విప్పారు. రాబోయే ఐదేళ్లలో మానవుల కంటే తెలివైన 'సూపర్ ఇంటెలిజెంట్' ఏఐ వ్యవస్థలు వచ్చే అవకాశం ఉందని, వాటిపై మానవ నియంత్రణ కోల్పోయే ప్రమాదం ఉందని బ్రిటన్‌కు చెందిన అలన్ ట్యూరింగ్ ఇనిస్టిట్యూట్ నివేదిక కూడా ఇటీవల హెచ్చరించింది. ప్రస్తుతం ఏఐ ఏజెంట్లు అనధికారికంగా హ్యాకింగ్ ప్రయత్నాలు చేయడం, డ్రోన్ దాడులకు ప్లాన్ చేయడం వంటి ఘటనలు నమోదవుతున్న నేపథ్యంలో గేట్స్ హెచ్చరికలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఏఐ అభివృద్ధి వేగం, దాని దుర్వినియోగం వల్ల మానవాళికి ఎదురయ్యే ప్రమాదాలపై ఈ వ్యాఖ్యలు ప్రపంచవ్యాప్తంగా చర్చను రేకెత్తించాయి.

# దసరా కల్లా మెట్రో ఫేజ్-1 స్వాధీనం

( మొదటి పేజీ తరువాయి )



తగ్గించాలని భావిస్తున్నారు. ఎస్‌బీఐ క్యాప్స్ గుజరాత్‌లోని గిఫ్ట్‌సిటీ సహా ముంబైకి చెందిన పలు బ్యాంకులతో సంప్రదింపులు జరుపుతోంది. అయితే, వడ్డీ రేట్ల విషయంలోనే ప్రధాన ప్రతిబంధకం ఎదురవుతోంది. మొదట ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్‌ఎఫ్‌సీ) 4 శాతం లోపు వడ్డీకే రుణం (జపాన్ యెన్‌లు, రూపాయల మిశ్రమంగా) ఇచ్చేందుకు ముందుకొచ్చినప్పటికీ, ఆఖరి నిమిషంలో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. తాజాగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) రుణం ఇచ్చేందుకు ఆసక్తి చూపినప్పటికీ, వారు కోరుతున్న వడ్డీ రేటు 7 శాతానికి పైగా ఉండటంతో అధికారులు పునరాలోచనలో పడ్డారు. తక్కువ వడ్డీకి రుణ సమీకరణ యత్నాలు ఫలించని పక్షంలో ప్రత్యామ్నాయ మార్గాలను ప్రభుత్వం అన్వేషిస్తోంది. ఇందులో భాగంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) నిధులను ఉపయోగించుకునే సాధ్యాసాధ్యాలను కూడా అధ్యయనం చేస్తోంది. మరోవైపు ఐఆర్‌ఎఫ్‌సీ ద్వారా రుణం పొందేందుకు పాత అగ్రిమెంట్ ప్రకారం ప్రయత్నాలను కొనసాగిస్తూనే ఉంది.

**షేర్ పర్చేజ్ అగ్రిమెంట్ మరియు ఆలస్యం**
మెట్రో ఫేజ్ 1లోని ఎల్ అండ్ టీ వాటాను రూ. 1461.47 కోట్లతో కొనుగోలు చేసేందుకు ఈ ఏడాది ఏప్రిల్ 29న తెలంగాణ ప్రభుత్వం షేర్ పర్చేజ్ అగ్రిమెంట్ కుదుర్చుకుంది. అప్పటి నుంచి రుణాలపై వడ్డీ భారం ప్రభుత్వంపై పడుతోంది. వాస్తవానికి జూన్ 30 నాటికి రుణ సమీకరణ ప్రక్రియ పూర్తవుతుందని సెబీకి ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రో రైలు లిమిటెడ్ ముందుగా తెలిపింది. అయితే, రుణం ఆగిపోవడంతో సెప్టెంబర్ 30 కల్లా పూర్తవుతుందని మరోసారి సెబీ దృష్టికి తీసుకెళ్లింది.

### పండగ సీజన్ వేళ
## ఏసీ, టీవీల రేట్ల షాక్
**అక్టోబర్ 1 నుండి**
**8శాతం దాకా ధరల పెంపు**

**హైదరాబాద్ బిజినెస్ :** పండగ సీజన్‌కు ముందు.. వినియోగదారులకు ప్రముఖ కన్జూమర్ ఎలక్ట్రానిక్ కంపెనీలు షాక్ ఇచ్చాయి. తమ ఉత్పత్తుల ధరలను పెంచుతున్నట్లు ప్రకటించాయి. ఎయిర్ కండీషనర్లు, ఎల్‌ఈడీ టీవీలు, వాషింగ్ మెషిన్లు సహా ఇతర గృహోపకరణాల ధరలను 58 శాతం మేర సవరించాయి. కొత్త ధరలు అక్టోబర్ 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో ఉద్రిక్తతల వల్ల రాగి, స్టీల్, క్రూడాయిల్ వంటి ముడి పదార్థాల ధరలు పెరగడం, రూపాయి విలువలో హెచ్చుతగ్గులు ఇందుకు కారణాలుగా కంపెనీలు తెలిపాయి. ఎయిర్ కండీషనర్ల ధరలను 58 శాతం పెంచినట్లు ఆయా సంస్థల ఎగ్జిక్యూటివ్స్ తెలిపారు. వాషింగ్ మెషిన్లు, ఎల్‌ఈడీ టీవీలు, రిఫ్రిజిరేటర్ల ధరలు 34 శాతం వరకు పెరిగాయి. ఈ నిర్ణయంతో పండగ సీజన్‌పై ప్రభావం పడుతుందని కొన్ని కంపెనీలు ఆందోళన వ్యక్తం చేయగా.. మరికొన్ని కంపెనీలు ఇది తాత్కాలికమేనని అంటున్నాయి. ముడిపదార్థాల ధరలు పెరగడంతో ఏసీ, రిఫ్రిజిరేటర్ల ధరలను 58 శాతం పెంచినట్లు బ్లూ స్టార్ మేనేజింగ్ డైరెక్టర్ బి.త్యాగరాజన్ తెలిపారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలే ఇందుకు కారణమన్నారు. ఒక గోద్రెజ్ అన్ని కేటగిరీలపై ధరలను 57శాతం ధరలు సవరించింది. పండుగ సీజన్ ముందు ఈ పెంపు చేపట్టినప్పటికీ.. డీలర్లు, డిస్ట్రిబ్యూటర్ల వద్ద పాత ధరలకే కొనుగోలు చేసిన సరకు ఉందని కంపెనీలు తెలిపాయి.

# కౌశిక్.. కడియంకు
# ఉప గండం

( మొదటి పేజీ తరువాయి )



కౌశిక్ రెడ్డి అంశంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఎత్తుగడలు ఫలిస్తాయా? ఇది ఫ్రైజర్ గేమ్ గా మిగిలిపోతుందా? అన్నది చూడాలి. ఇక కడియం శ్రీహరి విషయంలో మాత్రం దానం నాగేందర్ కు ఎదురైన తీర్పు రిపీట్ కావడం ఖాయమని బీఆర్ఎస్ ధీమాగా ఉంది. నవంబర్ తర్వాత కడియం పై తీర్పు వచ్చే అవకాశముందని, ఖైరతాబాద్ తో పాటు స్టేషన్ ఘన్ పూర్ ఎన్నిక కూడా రావొచ్చని బీఆర్ఎస్ వర్గాలు అంటున్నాయి. కడియం శ్రీహరి కుమార్తె కాంగ్రెస్ పార్టీ నుండి లోక్ సభ అభ్యర్థిగా ఉండగా, నామినేషన్ పత్రాలపై మద్దతుదారు కాలమ్ లో కడియం శ్రీహరి సంతకం చేశారని, దాని వల్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉండి కాంగ్రెస్ కు మద్దతిస్తున్నట్లు స్పష్టంగా రుజువైందని బీఆర్ఎస్ వర్గాలు అంటున్నాయి. అయితే ఈ ఆరోపణలు చట్టపరిధిలో ఎంతవరకు నిలుస్తాయి? పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద కడియం శ్రీహరి కూడా అనర్హతకు గురవుతారా? లేక రక్షణ లభిస్తుందా? అన్నది చూడాలి. బీఆర్ఎస్ వర్గాలు మాత్రం 2027లో స్టేషన్ ఘన్ పూర్ ఉప ఎన్నిక ఖాయమని చెబుతున్నాయి.

**ఉప ఎన్నికల కాలం**
తెలంగాణలో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత సికింద్రాబాద్ కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు జరగ్గా, ఈ రెండు స్థానాలు బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్ గెలిచింది. జూబ్లీహిల్స్ పై బీఆర్ఎస్ ఎన్నో ఆశలు పెట్టుకుని గట్టిగా ఫైట్ చేసినా రేవంత్ వ్యూహాల ముందు అవి పనిచేయలేదు. ఖైరతాబాద్ ఎన్నికకు బీఆర్ఎస్ కారణమైనా, ఇది తమకే లాభిస్తుందని కాంగ్రెస్ భావిస్తోంది. ఖైరతాబాద్ లో కాంగ్రెస్ గెలిస్తే వెంటనే జీహెచ్ఎంసీ ఎన్నికలు కూడా నిర్వహించే అవకాశముంది. ఖైరతాబాద్ ఎన్నిక జరిగితే మూడేళ్ళలో మూడు ఉప ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ను ఎదురులేనివిధంగా నిలిపిన ఘనత రేవంత్ రెడ్డికే దక్కుతుంది. కోరి ఎన్నికలు తెచ్చినా ప్రజాక్షేత్రంలో గెలవకపోతే బీఆర్ఎస్ కు రాజకీయంగా సమస్యలు పెరిగే అవకాశమూ ఉంది.

### దసరాకు రెడీ అవుతున్న ఏపీ
# విజయవాడ ఉత్సవ్ సీజన్-2



**విజయవాడ, మహా :** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం దసరా శరన్నవరాత్రులకు సిద్ధం అవుతుంది. మైసూర్ తరహాలో దసరా ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించాలని భావించిన ఏపీ సర్కార్ గతే ఏడాది అత్యంత ఘనంగా దసరా ఉత్సవాలను నిర్వహించింది. మళ్ళీ ఈ ఏడాది కూడా దసరా ఉత్సవాలకు రంగం సిద్ధం చేస్తుంది. గతేడాది నిర్వహించిన దసరా ఉత్సవ్ కు ఏపీ నుండి మాత్రమే కాక ఇతర రాష్ట్రాల నుండి కూడా విశేషమైన స్పందన వచ్చింది. ఆదివారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గతేడాది నిర్వహించిన విజయవాడ ఉత్సవ్ విజయవంతమైందని, దుర్గమ్మ దర్శనానికి వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు ఉత్సవాలను సందర్శించారని చెప్పారు. ఈ ఏడాది అక్టోబర్ 11 నుంచి 22వ తేదీ వరకు పున్నమి ఘాట్ తో పాటు మాకినేని బసవపున్నయ్య స్టేడియంలోనూ విజయవాడ ఉత్సవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా ప్రతి రోజూ సుమారు లక్షన్నర మంది భక్తులు అమ్మవారి దర్శనానికి వస్తారని, వారంతా నగరంలో ఒకట్రెండు రోజులు ఆహ్లాదంగా గడిపేలా ఉత్సవాలను తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ఈ నెల 28న సోమవారం అంబేద్కర్ కళావేదికలో విజయవాడ ఉత్సవ్ కర్టెన్ రైజర్ వేడుక నిర్వహించనున్నామని, దీనికి పలువురు రాష్ట్ర మంత్రులు హాజరవుతారని తెలిపారు. వైబ్రంట్స్ ఆఫ్ విజయవాడ ఆధ్వర్యంలో, అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర పర్యాటక శాఖ సహకారంతో ఉత్సవాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. దేశంలోని పలువురు ప్రముఖులను ఆహ్వానిస్తున్నామని, ఏడెనిమిది మంది ముఖ్యమంత్రులు పాల్గొనే అవకాశం ఉందన్నారు.

# భద్రాచలం వద్ద ఉగ్రరూపం దాల్చుతున్న గోదావరి



**భద్రాచలం,మహా :** భద్రాచలం వద్ద గోదావరి నది ఉగ్రరూపం దాల్చుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వస్తున్న వరద నీటితో నదిలో నీటిమట్టం అంతకంతకూ పెరుగుతోంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద వరద ఉద్ధృతి ఏకంగా 8 నుంచి 9 లక్షల క్యూసెక్కులకు చేరే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో గోదావరి పరీవాహక, లోతట్టు ప్రాంతాల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

**పెరుగుతున్న నీటిమట్టాలు ఇవే..**
రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రస్తుతం భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 40 అడుగులకు చేరింది. అలాగే కూనవరం వద్ద 14.8 మీటర్లు, పోలవరం వద్ద 9.98 మీటర్ల మేర నీటిమట్టం నమోదైంది. మరోవైపు ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ వద్ద ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 5.61 లక్షల క్యూసెక్కులుగా కొనసాగుతోంది. అయితే, వరద గరిష్ఠ స్థాయికి చేరిన అనంతరం క్రమంగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని ఆయన అంచనా వేశారు.

**రంగంలోకి సహాయక బృందాలు**
వరద ప్రభావిత జిల్లాల్లో ఎలాంటి విపత్కర పరిస్థితులు తలెత్తినా ఎదుర్కొనేందుకు, అత్యవసర సహాయక చర్యల నిమిత్తం ఇప్పటికే ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు ప్రఖర్ జైన్ వెల్లడించారు. లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉంటూ సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. ముఖ్యంగా ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులు, కల్వర్టులు, కాజ్‌వేల వద్ద ప్రమాదకరంగా ప్రయాణాలు చేయవద్దని, వరద ప్రవాహాన్ని దాటే ప్రయత్నం చేయవద్దని ఆయన ప్రజలను హెచ్చరించారు.

### ఐదు రోజుల పని కోసం
### మూడు రోజుల సమ్మె

(మొదటి పేజీ తరువాయి )

బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు ప్రజలకు సేవలందించాయి. ఈ మూడు రోజులు శాఖల్లో నేరుగా చేసే పనులకు ఆటంకం కలిగినా డిజిటల్ సర్వీసులు యథాతథంగా పని చేస్తాయని, నగదు అవసరమున్న కస్టమర్లు ఏటీఎంలను ఉపయోగించుకోవచ్చని ఆయా బ్యాంకుల మేనేజర్లు తెలిపారు. ప్టెంబర్ 30 వరకు బ్యాంకులు మూసివుండడంతో ఈ సమయంలో సేవలకు అంతరాయం ఏర్పడితే వ్యాపార, ప్రభుత్వ, ఇతర ఆర్థిక లావాదేవీల పై అదనపు ఒత్తిడి పడే అవకాశం ఉందని వ్యాపారులు వాపోతున్నారు. ప్రజల బ్యాంకింగ్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఏటీఎంలలో నగదు లభ్యత, డిజిటల్ బ్యాంకింగ్ సేవలు, అత్యవసర లావాదేవీలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు పటిష్టంగా ఏర్పాటు చేయాలని ఖాతాదారులు కోరుతున్నారు.

# ఉగ్రవాదంపై ఉక్కుపాదం

( మొదటి పేజీ తరువాయి )

భారత్ ఎంత దీటుగా, నిర్ణయాత్మకంగా బదులిస్తుందో చెప్పడానికి ఈ ఆపరేషన్ సరికొత్త ఉదాహరణగా నిలిచిందని, ఇది ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా జరగనున్న జనగణన (సెన్సస్) ప్రక్రియను ప్రధాని ప్రస్తావించారు. ఇది ప్రతి పౌరుడి జాతీయ బాధ్యత అని, అందరూ ఇందులో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. దేశ జనాభా, సామాజిక, ఆర్థిక సమాచార సేకరణలో పౌరుల భాగస్వామ్యం అత్యంత కీలకమని, ఇందుకు అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ విధానాన్ని కూడా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**మోఢేరా.. దేశంలోనే తొలి సోలార్ గ్రామం**
గుజరాత్‌లోని చారిత్రక మోఢేరా సూర్య దేవాలయం వెయ్యేళ్ల ప్రస్థానాన్ని మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. విదేశీ దండయాత్రల్లో విధ్వంసానికి గురైన ఆ ఆలయ పునర్నిర్మాణాన్ని గుర్తుచేశారు. ఆ గ్రామం నేడు దేశంలోనే మొట్టమొదటి ‘24x7 సోలార్ విలేజ్’గా ఆవిర్భవించడం గర్వకారణమన్నారు. మకర సంక్రాంతి తర్వాత ఇక్కడ జరిగే 'మోఢేరా నృత్య ఉత్సవం'లో భారతీయ శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని, జీవితంలో ఒక్కసారైనా భారతీయులంతా ఈ ప్రాంతాన్ని సందర్శించాలని కోరారు. మాదకద్రవ్యాల మహమ్మారిని తరిమికొట్టేందుకు ‘నషా ముక్త్ యువ అభియాన్’ ద్వారా యువత ముందుకు రావడం అభినందనీయమన్నారు. అలాగే, రానున్న గాంధీ జయంతిని పురస్కరించుకుని స్వచ్ఛత నినాదాన్ని ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో పురాతన కోనేరులు, బావులకు పునర్ వైభవం తీసుకొచ్చే దిశగా జరుగుతున్న పరిశుభ్రత కార్యక్రమాలను, ఢిల్లీలో పొడి, తడి చెత్తను వేర్వేరుగా సేకరించే విధానాన్ని, మధ్యప్రదేశ్‌లో నదిని శుభ్రం చేసిన ఓ యువకుడి చొరవను ప్రధాని ప్రశంసించారు.

# ఊరువాడా ఉత్సాహంగా అమ్మకు అక్షరమాల



**హైదరాబాద్, మహా :** ఏళ్ల తరబడి అక్షరాలకు దూరంగా ఉన్న వయోజనులు ఇప్పుడు తమ జీవితాల్లో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతున్నారు. తెలుగు అక్షరాలను గుర్తించలేని స్థితి నుంచి చదవడం, రాయడం, లెక్కలు చేయడం నేర్చుకున్న లక్షలాది మంది ఆదివారం ‘ఉల్లాస్’ పరీక్ష రాశారు. అమ్మకు అక్షరమాల కార్యక్రమంలో బాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ అసెస్‌మెంట్ టెస్ట్‌కు 6.32 లక్షల మంది వయోజనులు హాజరయ్యారు. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 5.32 లక్షల మంది మహిళలు, పట్టణ ప్రాంతంలో లక్ష మంది వరకు పరీక్ష రాశారు. రాష్ట్రంలోని 124 పట్టణ స్థానిక సంస్థల్లో, అలాగే పరిధిలోని సర్కిళ్లలో పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు 98,324 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు, 720 మంది వీధి వ్యాపారులు హాజరై పరీక్ష రాశినట్లు, వయోజన విద్యాశాఖ సమన్వయంతో ఈ పరీక్షను నిర్వహించినట్లు సెర్ప్ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా పరీక్ష రాసిన స్వయం సహాయక సంఘాల మహిళలు, ఇతర వయోజన అభ్యాసకులకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అభినందనలు తెలిపారు. “అక్షరం నేర్చుకోవడం అంటే కేవలం చదవడం, రాయడం రావడం కాదు.. అది ఆత్మవిశ్వాసాన్ని సంపాదించుకోవడం. ఇంతకాలం వేలిముద్రతో తమ అవసరాలను పూర్తి చేసుకున్న మహిళలు ఇకపై తమ పేరును తామే రాసుకునే స్థాయికి రావడం ఒక గొప్ప మార్పు. చదువుకు వయసు లేదు.. నేర్చుకోవాలన్న సంకల్పమే ముఖ్యం” అని మంత్రి సీతక్క అన్నారు.

చిన్న వయసులోనే పెళ్లిళ్లు, కుటుంబ బాధ్యతలు, ఆర్థిక ఇబ్బందులు, ఉపాధి కోసం ఎదురైన పరిస్థితులు తదితర కారణాలతో చదువుకు దూరమైన మహిళలు రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో ఉన్నారని మంత్రి పేర్కొన్నారు. జీవితంలో ఏ దశలో చదువు ఆగిపోయినా, మళ్లీ అక్కడి నుంచే విద్యను కొనసాగించే అవకాశం ప్రభుత్వం కల్పిస్తోందన్నారు.

“ఒక మహిళ అక్షరాస్యురాలైతే ఒక్క వ్యక్తి మాత్రమే చదువుకున్నట్టు కాదు.. ఒక కుటుంబానికి వెలుగు వస్తుంది. ఆమె తన పిల్లల చదువును పట్టించుకుంటుంది, బ్యాంకు లావాదేవీలను అర్థం చేసుకుంటుంది, ఆరోగ్యం గురించి తెలుసుకుంటుంది, ప్రభుత్వ పథకాలను స్వయంగా తెలుసుకుని వినియోగించుకోగలుగుతుంది. అందుకే మహిళా అక్షరాస్యతను కేవలం విద్యాశాఖ కార్యక్రమంగా కాకుండా సామాజిక మార్పు ఉద్యమంగా చూడాలి” అని సీతక్క స్పష్టం చేశారు.

**గ్రామంలోనే చదువు.. ఖర్చు లేకుండా విద్య**
తెలంగాణ ప్రభుత్వం ‘అమ్మకు అక్షరమాల’ పేరుతో అక్షరాస్యతకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పిస్తూ అక్షరాస్యత కార్యక్రమాలను అమలు చేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల మహిళలను గుర్తించి, వారి నివాస ప్రాంతాల్లోనే విద్యను అందించేలా చర్యలు చేపడుతోంది. సెర్ప్ ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంతో ఈ ప్రయత్నాలకు మరింత ఊతమిస్తోంది. విద్య కోసం మహిళలు ప్రత్యేకంగా ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేకుండా గ్రామాల్లోనే అభ్యసించే అవకాశం కల్పిస్తున్నారు. ఎటువంటి ఫీజు లేకుండా అక్షరాస్యతను అందించడం ద్వారా చదువు అందరికీ అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

202526 సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షల మంది నిరక్షరాస్యులుగా అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా 13 లక్షల మంది వయోజన నిరక్షరాస్యులకు 100 రోజులపాటు విద్యా కేంద్రాల్లో ఈ ఏడాది శిక్షణ అందించారు. అభ్యాసకుల కోసం ప్రభుత్వం ‘అక్షర వికాసం’ పేరుతో ప్రత్యేక పుస్తకాలను రూపొందించి అందించింది. తెలుగు అక్షరాలు చదవడం, రాయడం, అంకెలను గుర్తించడం, కూడికలు, తీసివేతలతో పాటు రోజువారీ జీవితానికి అవసరమైన అనేక అంశాలను ఈ పుస్తకాల ద్వారా నేర్పించారు.

**మార్చి పరీక్షలో 5.20 లక్షల మంది ఉత్తీర్ణత**
ఈ కార్యక్రమంలో భాగంగా మార్చి నెలలో 6.29 లక్షల మంది చదవడం, రాయడం, లెక్కలపై పరీక్ష రాశారు. జూన్‌లో విడుదలైన ఫలితాల్లో 5.21 లక్షల మంది వరకు ఉత్తీర్ణులయ్యారు. వారికి జాతీయ సార్వత్రిక విద్యాపీఠం నుంచి అక్షరాస్యత ధ్రువీకరణ పత్రాలు అందాయి. కాగా రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం నాడు నిర్వహించిన ఉల్లాస్ పరీక్షకు 6.32 లక్షల మందికి పైగా హాజరుకావడం ద్వారా అక్షరాస్యత కార్యక్రమంపై వయోజనుల్లో పెరుగుతున్న ఆసక్తి స్పష్టమవుతోందని అధికారులు తెలిపారు.

**అక్షరాస్యతతో పాటు తదుపరి విద్యకు అవకాశం**
ఉల్లాస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి భవిష్యత్‌లో విద్యను కొనసాగించేందుకు అవకాశాలు కల్పిస్తున్నారు. వారు పదో తరగతి పరీక్ష రాసేందుకు అవకాశం కల్పిస్తున్నారు. 2026-27 విద్యా సంవత్సరానికి తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీలో ప్రవేశాలు కొనసాగుతున్న నేపథ్యంలో, మహిళలు పెద్ద సంఖ్యలో ఓపెన్ స్కూల్ విద్యను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సీతక్క కోరారు. తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ, హిందీ తదితర భాషల్లో సబ్జెక్టులను ఎంచుకునే అవకాశం ఉందని, కుట్టు, కంప్యూటర్, ఎలక్ట్రీషియన్, బ్యూటీషియన్ వంటి వృత్తి కోర్సులను కూడా అదనంగా నేర్చుకునే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ఆసక్తి ఉన్నవారు సమీపంలోని మీసేవ కేంద్రం లేదా స్టడీ సెంటర్‌ను సంప్రదించడంతో పాటు telanganaopenschool.org వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. హిళలను ఆర్థికంగా బలోపేతం చేయడం ఎంత ముఖ్యమో, వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దడం కూడా అంతే ముఖ్యం. చేతిలో పొదుపు పుస్తకం ఉండాలి.. అదే సమయంలో దానిలో ఏముందో చదివే అక్షరజ్ఞానం కూడా ఉండాలి. ప్రభుత్వ పథకం ఏమిటో తెలుసుకునే హక్కు, తన హక్కులను చదివి అర్థం చేసుకునే శక్తి ప్రతి మహిళకు ఉండాలి అని మంత్రి పేర్కొన్నారు. మహిళల ఆర్థిక, విద్యా, సామాజిక సాధికారతను సమాంతరంగా ముందుకు తీసుకెళ్లడమే ఇందిరా మహిళా శక్తి లక్ష్యమని ఆమె తెలిపారు. అక్షరాస్యత ఉద్యమం ఆగదు.. లక్ష్యం చేరే వరకు కొనసాగుతుంది అని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.




## దర్శిపై కేటీఆర్ ప్రశంసలు
**రుణపడి ఉంటాను రామన్నా**
**అంటూ ప్రియదర్శి ఆనందం**

**హైదరాబాద్, మహా :** నాని 'ప్యారడైజ్' సినిమాపై, అందులో ప్రియదర్శి నటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశంసలు కురిపించారు. ఈ అభినందనలకు ప్రియదర్శి కృతజ్ఞతలు తెలుపుతూ స్పందించారు. వీరిద్దరి మధ్య సోషల్ మీడియాలో జరిగిన ఈ సంభాషణ ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. 'ప్యారడైజ్' చిత్రాన్ని వీక్షించిన కేటీఆర్ 'ఎక్స్' వేదికగా తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. "ఆత్మగౌరవ పోరాటం, అణచివేతపై తిరుగుబాటు. అవసరమొస్తే గడ్డిపోచలు కూడా గడ్డపారలుగా మారతాయని సందేశాన్నిచ్చిన తమ్ముడు శ్రీకాంత్ ఓదెలకు మనస్ఫూర్తిగా అభినందనలు. ప్రధాన పాత్రలో జీవించిన మిత్రుడు నానికి శుభాకాంక్షలు. తమ్ముడు ప్రియదర్శికి ప్రత్యేక అభినందనలు" అని కేటీఆర్ పోస్ట్ చేశారు. కేటీఆర్ ప్రశంసలపై ప్రియదర్శి స్పందిస్తూ.. "పెళ్లిచూపుల నుంచి ప్యారడైజ్ వరకు నా సినిమాలపై మీరు చూపిస్తున్న ప్రేమకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు. మీకు నేను రుణపడి ఉంటాను రామన్నా" అని బదులిచ్చారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రంలో ప్రియదర్శి 'ఎమ్మెల్యే శంకరన్న' పాత్రను పోషించారు. ఈ పాత్ర ఆహార్యం, హావభావాలు తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను పోలి ఉన్నాయంటూ సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. అయితే, ఇది తెలంగాణలో తన అనుభవాల ఆధారంగా అల్లుకున్న కల్పిత కథ అని దర్శకుడు శ్రీకాంత్ ఓదెల గతంలోనే స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో శంకరన్న పాత్రను కేటీఆర్ ప్రత్యేకంగా మెచ్చుకోవడం సినిమాపై రాజకీయ చర్చను మరింత పెంచింది.

## రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయం

( మొదటి పేజీ తరువాయి )



ఓట్ల చోరీ ఎలా జరుగుతుందో రాహుల్ గాంధీ దేశ ప్రజలకు వివరించారని తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతోందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతంగా పనిచేస్తుందని మంత్రి తెలిపారు. తెలంగాణలోని అన్ని పార్లమెంట్ స్థానాలను గెలిపించేందుకు కాంగ్రెస్ శ్రేణులు కంకణబద్ధులై పనిచేస్తాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

# కంది శ్రీనన్న పరామర్శ







- గ్రామాలను చుట్టేస్తున్న కాంగ్రెస్ నేత
- ఆదిలాబాద్ రూరల్, సాత్నాల మండలాల్లో పర్యటించిన కంది శ్రీనివాసరెడ్డి
- ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో విస్తృత పర్యటనలు

**(ఆదిలాబాద్ మహా) :** ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఆదివారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని లింగుగూడ, పిప్పల్ దారి, జామిని, న్యూరాంపూర్, పొచ్చర్ల తదితర గ్రామాల్లో పర్యటించారు. ఆదిలాబాద్ రూరల్ మండలం పొచ్చర గ్రామానికి చెందిన సుర్కుంటి సురేష్ రెడ్డి గారు ఇటీవల గుండె పోటుతో మృతి చెందడంతో ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి గారు వారి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సాత్నాల మండలం న్యూ రాంపూర్ గ్రామానికి చెందిన నలగంటి మోహన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి వారి నివాసానికి వెళ్లి వారిని కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయన్ని అందించారు. సాత్నాల మండలం జామిని గ్రామానికి చెందిన మేస్త్రం షైక్ ఫరీద్ ఇటీవల అనారోగ్యంతో బాధపడటంతో ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి వారి నివాసానికి వెళ్లి వారిని పరామర్శించి ఆర్థిక సాయన్ని అందించారు. ఆదిలాబాద్ రూరల్ మండలం పిప్పల్ దరి గ్రామానికి చెందిన ఇగరపు ఇస్తారి బాయి , చెర్ల చిన గంగన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. నీలకంటి అనారోగ్యం బారిన పడటంతో వారి నివాసాలకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి పరామర్శించారు.












# ఉమెన్ ఏపీఎల్ ఛాంపియన్ గా రాయలసీమ జెన్ స్టార్స్

**ఫైనల్ మ్యాచ్ కు ప్రత్యేక ఆకర్షణగా నిధి అగర్వాల్**

**మంగళగిరి, మహా :** ఉమెన్ ఏపీఎల్ ఛాంపియన్ గా రాయలసీమ జెన్ స్టార్స్ జట్టు నిలిచింది. తొలి సీజన్ లోనే తిరుగులేని ఆధిపత్యంతో.. ప్లానింగ్ తో విజయతీరాలకు చేరింది. గోదావరి గోల్డెన్ ఈగల్స్ రన్నరప్ గా నిలిచింది. ఆది నుండీ అద్భుత ఆటతీరుతో రాయలసీమ జెన్ స్టార్స్ ప్రతి విభాగంలోనూ ఆధిపత్యం కనబరిచింది. ఈ జట్టుకు ప్రఖ్యాత నటి నిధి అగర్వాల్ బ్రాండ్ అంబాసిడర్ గా ఉండగా, ఫైనల్ కు హాజరై క్రీడాకారులను ఉత్సాహపరిచింది. ఆంధ్రప్రదేశ్ లోని మహిళా క్రికెట్ కు ఈ సిరీస్ బూస్ట్ లా నిలిచింది. ఆరు వికెట్ల తేడాతో గోదావరి జట్టుపై రాయలసీమ నెగ్గింది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ వినూత్న కార్యక్రమాల ద్వారా దేశంలోని క్రికెట్ అసోసియేషన్లలో ఒక ప్రత్యేక ఒరవడిని సాధించింది.






# తెలంగాణలో పెరగనున్న ఉష్ణోగ్రతలు

**వాతావరణ శాఖ వెల్లడి**

**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం ఆకాశం నిర్మలంగా ఉండటంతో పాటు పొడి వాతావరణం నెలకొంది. రానున్న రోజుల్లో ఎండ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ అంచనాలు సూచిస్తున్నాయి. పలు ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 34 నుంచి 35 డిగ్రీల సెల్సియస్‌ను దాటే అవకాశం ఉంది. అయితే ఉదయం వేళల్లో మాత్రం వాతావరణం ఆహ్లాదకరంగానే ఉండనుందని తెలిపారు. ఈ నెల 29న దక్షిణ తెలంగాణలో కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. మిగతా తెలంగాణలో అక్టోబర్ 2వ తేదీ వరకు ప్రధానంగా పొడి వాతావరణమే కొనసాగుతుందని అంచనా వేశారు. ఆ తర్వాత గాలుల




దిశలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. తూర్పు దిశ నుంచి వీచే గాలుల ప్రభావంతో ఆగ్నేయ తెలంగాణలో కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశముంది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ సరిహద్దులకు సమీపంలోని ప్రాంతాల్లో ఈ ప్రభావం కనిపించే అవకాశం ఉన్నట్లు అంచనాలు సూచిస్తున్నాయి. అయితే రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లో పొడి వాతావరణమే కొనసాగే అవకాశం ఉందని వెల్లడించారు. ప్రస్తుతం తెలంగాణలోని చాలా ప్రాంతాల్లో వర్షాకాలం నుంచి పొడి వాతావరణ పరిస్థితుల వైపు మార్పు ప్రారంభమైనట్లు అంచనా. తేమతో కూడిన తూర్పు గాలులు బలపడితేనే రాష్ట్రంలో విస్తృతంగా వర్షాలు తిరిగి నమోదయ్యే అవకాశం ఉంటుందని వాతావరణ పరిశీలనలు సూచిస్తున్నాయి. మొత్తంగా తెలంగాణలో రానున్న రోజుల్లో ఉదయం వేళల్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఉన్నప్పటికీ, పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరిగే అవకాశం ఉంది. దక్షిణ తెలంగాణలో మాత్రం ఈ నెల 29న అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఆయా ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ పరిస్థితులను గమనించాలని సూచిస్తున్నారు.

# హుస్సేన్‌సాగర్ తీరాన 35 వేల మందితో ‘పింక్ పవర్ రన్ 3.0’

**హైదరాబాద్, మహా :** రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన.. ముందస్తు గుర్తింపు ప్రాధాన్యంపై చైతన్యం.. మహిళల ఆరోగ్య సంరక్షణ, సాధికారతకు మద్దతుగా హైదరాబాద్ పరుగులు తీసింది. మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్), సుధారెడ్డి ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన ‘పింక్ పవర్ రన్ 3.0’కు ఆదివారం అపూర్వ స్పందన లభించింది. హుస్సేన్‌సాగర్ తీరంలోని హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్ నుంచి ప్రారంభమైన ఈ మెగా కమ్యూనిటీ రన్‌లో దాదాపు 35 వేల మందికి పైగా పాల్గొన్నారు. ఆరోగ్యం, ఫిట్‌నెస్, ముందస్తు వైద్య పరీక్షలు, రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమం.. హైదరాబాద్‌లో అతిపెద్ద కమ్యూనిటీ ఫిట్‌నెస్ కార్యక్రమాల్లో ఒకటిగా నిలిచింది.

పింక్ పవర్ రన్‌లో నాలుగు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. 21 కిలోమీటర్ల హాఫ్ మారథాన్, 10 కిలోమీటర్లు, 5 కిలోమీటర్లు, 3 కిలోమీటర్ల పరుగులు నిర్వహించారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అన్ని వయసుల వారు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఐదేళ్ల చిన్నారులతో పాటు 80 ఏళ్లకు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమం స్ఫూర్తిని చాటారు.

**అంతర్జాతీయ రన్నర్లతో హాఫ్ మారథాన్**

21 కిలోమీటర్ల హాఫ్ మారథాన్‌కు అంతర్జాతీయ స్థాయిలో స్పందన లభించింది. అమెరికా, ఇంగ్లాండ్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇథియోపియా, ఉగాండా, శ్రీలంక, ఐస్‌లాండ్, టాంజానియా, బోట్స్వానా, కెన్యా, కెనడా తదితర దేశాల నుంచి రన్నర్లు పాల్గొన్నారు. దేశ, విదేశాలకు చెందిన రన్నర్లతో నెక్లెస్‌రోడ్డుపై అంతర్జాతీయ క్రీడా వాతావరణం నెలకొంది.

పింక్ పవర్ రన్‌ను తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క), తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్, ఎంఈఐఎల్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ పీవీ కృష్ణారెడ్డి, సుధా రెడ్డి



ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు సుధా రెడ్డి, హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ జనరల్ లారా విలియమ్స్, ఓలెక్ట్రా గ్రీన్‌టెక్ (ఈవీ ట్రాన్స్) ఉపాధ్యక్షుడు వీవీ లక్ష్మీ నారాయణ తదితరులు జెండా ఊపి ప్రారంభించారు. సినీ నటుడు సిద్ధు జొన్నలగడ్డ, మాజీ ప్రపంచ సుందరి ఓపల్ సుచేత, భారత ప్రొఫెషనల్ బాక్సర్ విజేందర్ సింగ్, నారాయణ గ్రూప్ విద్యాసంస్థల డైరెక్టర్ పునీత్, అవినాష్ గ్రూప్ సంస్థల చైర్మన్ అవినాష్ తదితరులు పాల్గొని రన్నర్లలో ఉత్సాహం నింపారు.

పింక్ పవర్ రన్‌లో మహారాష్ట్రకు చెందిన రమాబాయి రణ్‌వీర్ పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బీడ్ జిల్లా అంబాజోగైకి చెందిన 47 ఏళ్ల రమాబాయి.. తన పిల్లల చదువుల కోసం గతంలో చెప్పులు లేకుండా ఐదు కిలోమీటర్లు పరుగెత్తి వార్తల్లో నిలిచారు. ఆమె పింక్ పవర్ రన్‌లో పాల్గొనడం ద్వారా మహిళల పట్టుదల, ఆరోగ్యంపై అవగాహన, సామాజిక బాధ్యతకు ప్రతీకగా నిలిచింది.వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు నిర్వాహకులు మొత్తం రూ.75 లక్షల విలువైన నగదు బహుమతులు అందించారు. నగదుతోపాటు మెడల్స్, ట్రోఫీలను నిర్వాహకులు, ముఖ్య అతిథులు అందజేశారు. 21కే హాఫ్ మారథాన్ పురుషుల విభాగంలో సునీల్ కుమార్ ప్రథమ స్థానంలో నిలవగా.. మహిళల విభాగంలో సోనమ్ విజేతగా నిలిచారు. 10కే రన్ పురుషుల విభాగంలో హరీష్ షరీన్ తొలి స్థానాన్ని సాధించగా.. మహిళల విభాగంలో వందన పటేల్ విజేతగా నిలిచారు. 5కే రన్ పురుషుల విభాగంలో లవ్ చౌధరి మొదటి స్థానంలో నిలవగా.. మహిళల విభాగంలో అంజలి విజయం సాధించారు.

**ఆరోగ్యంపై చైతన్యం పెరగాలి: సీతక్క**

మంత్రి దనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ.. ఆరోగ్య పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. హైదరాబాద్ మొత్తం ఈ కార్యక్రమానికి ఏకమైందని పేర్కొన్నారు. సుధా రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పింక్ పవర్ రన్‌లో యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడం అభినందనీయమన్నారు. సమాజంలో ఆరోగ్యంపై చైతన్యం పెంచేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు.

**ఆరోగ్యమే నిజమైన సంపద: పీవీ కృష్ణారెడ్డి**

ఎంఈఐఎల్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ పీవీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. జీవనశైలి వ్యాధులను నివారించేందుకు రోజువారీ వ్యాయామం ఎంతో అవసరమన్నారు. క్రమం తప్పకుండా శారీరక వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. వ్యక్తిగత ఆరోగ్యమే కాకుండా ఆరోగ్యకరమైన జీవనశైలి నిజమైన సంపద అని పేర్కొన్నారు.

**హైదరాబాద్‌కు ఉత్తమ అనుభవం ఇవ్వాలన్నదే లక్ష్యం: సుధా రెడ్డి**

సుధా రెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు సుధా రెడ్డి మాట్లాడుతూ.. పింక్ పవర్ రన్ మూడో ఏడాదికి చేరుకోవడం ఆనందంగా ఉందన్నారు. హైదరాబాద్‌లో పెరిగిన తమకు నగరానికి అత్యుత్తమ కార్యక్రమాలను అందించాలన్నదే లక్ష్యమని తెలిపారు. పింక్ పవర్ రన్‌కు తరలివచ్చిన భారీ జనసందోహం చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉందని.. కార్యక్రమం మొత్తం ఉత్సాహభరిత వాతావరణంలో సాగిందని చెప్పారు. గణేశ్ నిమజ్జన సందడితోపాటు నగరంలో పింక్ పవర్ రన్ ఉత్సాహం కనిపించిందన్నారు. ఫిట్‌నెస్, ఆరోగ్యానికి ప్రతి ఒక్కరూ అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆమె పిలుపునిచ్చారు. ఇక్కడి నుంచి తీసుకెళ్లే ఆరోగ్య స్ఫూర్తిని కుటుంబం, స్నేహితులు, సమాజంలోకి తీసుకెళ్లాలని కోరారు. పింక్ పవర్ రన్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరూ ఒక సెలబ్రిటీనే అని అభివర్ణించారు.

# ఎన్నారైలకు శ్రీవారి హుండీ నాణేలు

**తిరుమల, మహా:** తిరుమల శ్రీవారి హుండీలో భక్తులు సమర్పించిన విదేశీ నాణేలను ఎన్నారైలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఐదేళ్ల విరామం తర్వాత ఏపీఎన్ఆర్‌టీ సొసైటీ ‘సెవెన్ హిల్స్ టు సెవెన్ కాంటినెంట్స్’ పేరుతో ఈ కార్యక్రమాన్ని పునరుద్ధరించింది. విదేశీ భక్తులు, ఎన్నారైలు శ్రీవారి హుండీలో విదేశీ కరెన్సీ నోట్లు, నాణేలను కానుకగా సమర్పిస్తుంటారు. అయితే ఆర్బీఐ నిబంధనల ప్రకారం బ్యాంకులు విదేశీ కరెన్సీ నోట్లను మాత్రమే స్వీకరిస్తాయి. నాణేలను స్వీకరించకపోవడంతో టీటీడీ వద్ద అవి పెద్ద మొత్తంలో నిల్వ ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో గతంలో ఏపీఎన్ఆర్‌టీ వాటిని కొనుగోలు చేసి ఎన్నారైలకు అందించే కార్యక్రమాన్ని చేపట్టింది. అనంతరం ఈ కార్యక్రమం నిలిచిపోయింది. తాజాగా మళ్లీ ప్రారంభించారు.ప్రస్తుతం అమెరికా డాలర్ నాణేలను ఆకర్షణీయమైన బాక్సుల్లో ప్యాక్ చేసి విక్రయిస్తున్నారు. ఒక్కో బాక్సులో 20 డాలర్ల విలువైన నాణేలు ఉండగా, వాటిని 25 డాలర్లకు అందిస్తున్నట్లు ఏపీఎన్ఆర్‌టీ అధ్యక్షుడు వేమూరు రవి కుమార్ తెలిపారు. నాణేలు కావాలనుకునే ఎన్నారైలు గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ఏపీఎన్ఆర్‌టీ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని సూచించారు. త్వరలో ఇతర దేశాల నాణేలను కూడా అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నట్లు తెలిపారు.

# 29న పల్లె పండుగ 3.0

**నెల్లూరు, మహా:** గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చేపడుతున్న ‘పల్లె పండుగ 3.0’ కార్యక్రమం ఈ నెల 29న ప్రారంభం కానుంది. ఉదయగిరి నియోజకవర్గంలోని రామాపురం గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.10 వేల కోట్ల నిధులను కేటాయించింది. ఈ నిధులతో గ్రామాల్లో మౌలిక వసతులు, పారిశుధ్యం, తాగునీరు, రహదారుల అభివృద్ధి వంటి పనులు చేపట్టనున్నారు. సీఎం, డిప్యూటీ సీఎం పర్యటన నేపథ్యంలో సభా ప్రాంగణం, భద్రత, పార్కింగ్ తదితర ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేశ్ పరిశీలించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కూటమి నాయకులు సమాయత్తమవుతున్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ‘పల్లె పండుగ 3.0’ను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పిలుపునిచ్చారు.

మహా పత్రిక
తెలుగు
సోమవారం, హైదరాబాద్ | 28-09-2026



## సెప్టెంబర్ 28 జాషువా 131వ జయంతి సందర్భంగా మహా కవి జాషువా అవార్డు స్వీకరిస్తున్న కోయి కోటేశ్వర రావు

## కవన ఋషి

ఏ 'కవి కోకిల శోకాగ్ని గీతికిన్ నిరుపేద గబ్బిలాల్
నిదురలేచె
ఏ మహాకవివర్యు ప్రేమకౌముదిలోన ముంతాజు
మహలుయే మురిసిపోయె
ఏ 'కవి దిగ్గజు' సృజన వనమ్ములో ఫిరదౌసి చిరకీర్తి
పరిమళించె
ఏ 'పద్మ భూషణు' హృదయ మందిరములో ఘన
క్రీస్తు చరితమ్ము గడన కెక్కె

ఏ కళా ప్రపూర్ణుని కొత్త లోకమందు
సమత మమతలు భాస్కర చంద్రులట్లు
సిరుల వెలుతురు నిరతమ్ము కురియు చుండు
ఆ కవనరుషి జాషువా కంజలింతు

'వెన్నెల తుఫాను' పగిదిన్
కన్నీటి సునామి భంగి కావ్యా లెన్నో
మిన్నగ విరచించిన నీ
పెన్నొక అనలాంబుధి నిరుపేదల సుకవీ!

మంచు కొండ సొబగు, మల్లెదండ సొగసు
రంగరించి కవిత రాసినావు
అమ్మతనము లోని ఆర్ద్రతా తత్త్వమ్ము
తెలుగు పద్య మందు కలిపినావు

ఊరు వాడల మధ్యలో చేరియున్న
దుష్ట ఛాందస భావాల దుమ్ము దులిపి
మానవత్వంబు సుందర మార్గమందు
నవ్య కవితాసుమాలను నాటినావు

జీవన వ్యాకరణ సూత్ర శిల్ప మమర
అనుభవ గణాల భావమ్ము లలరు చుండ
పద్య పాదమ్ములకు కొత్త పరుగు నేర్పి
పంచమ సమాజములను చూపించి నావు

చంపకోత్పల వృత్తాల సరళి మార్చి
లలిత పద్యాల తోరణాలల్లి నావు
ఛందో ఫణతి సతీపరిష్వంగమనుచు
తెలుగు వచన పండితులకు తెలిపినావు

దీన జనవిముక్తి, దేశభక్తిని చాటి,
విశ్వ శాంతి గరిమ విశద పరచి,
కాల తత్వ మహిమ గ్రహియించి సతతమ్ము
కావ్య మల్లి నట్టి ఘనత నీది

వేయి పడగల సహితంగ విషముచిమ్ము క్రూర
మతసర్పముల రాతి గుండెలదర
కవన నృత్యము సల్పిన ఘనుడనీవు
ఆత్మ గౌరవ తత్వానికర్థ మీవు

అభ్యుదయ మహా కవి యొకండను చితముగ
నిను 'సెకండ్ గ్రేడు కవి' యన్న నేమి యగును?
సకల జనులంత ప్రథమ శ్రేణి కవియనుచు
ముదముగా రసనాగ్రాల మోయుచుండె



కోయి కోటేశ్వర రావు
9440480274

## 'గుగ్గిలం' పుస్తకావిష్కరణ సభ

ప్రభలత, డప్పోల్ల రమేష్ సంపాదకత్వంలో వెలువడిన మహాకవి గుర్రం జాషువా స్మృతి కవిత్వం "గుగ్గిలం" సంకలనం ఆవిష్కరణ సభ అక్టోబర్ 1న టిపిటిఎఫ్ భవన్, శాంతినగర్, సంగారెడ్డి నందు సాయంత్రం 5:30 నిమిషాలకు జరుగుతుంది. గుగ్గిలం సంకలనాన్ని ప్రముఖకవి ఏనుగు నరసింహారెడ్డి ఆవిష్కరిస్తారు. ముఖ్య అతిథులుగా ప్రముఖకవి, విమర్శకులు డా. నాళేశ్వరం శంకరం పాల్గొంటారు. డా. జె. జయప్రకాష్ పుస్తక సమీక్ష చేస్తారు. డా. బెల్లంకొండ సంపత్ కుమార్ సభాధ్యక్షత వహిస్తారు. అతిథులుగా కందుకూరి శ్రీరాములు, కెంపుల రాజు, మాతంగి చిరంజీవి, అబ్రహం మాదిగ, బి. అమృత్, రాంచందర్ భీం వంశీ, అమృత్ బండారి పాల్గొంటారు. ఎ. చంద్రమోహన్ ఆహ్వానం పలుకగా సొన్నాయిల బాల్ రాజ్ వందన సమర్పణ చేస్తారు.

**నిర్వహణ: బహుజనం సాంస్కృతిక వేదిక తెలంగాణ**
**9550923323**

## డాక్టర్ అమృతలత - పాలపిట్ట సంయుక్త ఆధ్వర్యంలో దీపావళి కథల పోటీ

సమాజంలో మంచిని పెంచడం, మనుషుల్లో హృదయ సంస్కారాన్ని ప్రోది చేయడం సాహిత్యం లక్ష్యం. మన చుట్టూరా సంక్లిష్టతలు, సంక్షోభాలు ఎన్ని వున్నా అనివార్యమైనది బతుకు ప్రయాణం. కనుక జీవితంపై ఆశనీ, పరిస్థితులను ఎదుర్కొనే ఆత్మస్థయిర్యాన్ని అందించడానికి సాహిత్యం తోడ్పడాలి. ఈ లక్ష్యానికి అనుగుణంగా కథా సాహిత్యాన్ని ప్రోత్సహించాలన్న దృష్టితో డాక్టర్ అమృతలత పాలపిట్ట సంయుక్తంగా ఈ ఏడాది దీపావళి (2026) కథల పోటీ నిర్వహించాలని సంకల్పించడమైంది.
సకల ప్రాంతాల తెలుగు వారు ఈ పోటీకి తమ కథలను పంపించవచ్చు.

| | |
|---|---|
| మొదటి బహుమతిః | రూ. 10000 |
| రెండో బహుమతిః | రూ. 6000 |
| మూడో బహుమతిః | రూ. 4000 |
| పది కథలకు ప్రత్యేక బహుమతులు | |
| ఒక్కొక్క కథకి | రూ. 1000 |

**నిబంధనలు:** సమాజ జీవితం బహుముఖీనమైనది. మానవ జీవితంలోని ప్రతి అంశమూ ఇతివృత్తానికి అర్హమైనది. కనుక కథా వస్తువు ఎంపిక రచయితల అభీష్టం. సామాజిక సంఘటనలే కాదు, మనిషి అంతరంగ అలజడుల్లోని పలు పార్శ్వాలను కథల ఇతివృత్తాలుగా ఎంపిక చేసుకోవచ్చు.
ఏం చెప్పారన్నదే కాదు ఎలా చెప్పారన్నది కథకు కీలకం. వస్తువును వినూత్న రీతిన సౌందర్యభరితంగా సృజించడం ప్రధానం. కనుక సరికొత్త కథా సంవిధానానికి పోటీలో ప్రాధాన్యం ఉంటుంది.
పోటీకి పంపించే కథలు కొత్త కథలయి ఉండాలి. ఇదివరకు ఎక్కడా ప్రచురితం, ప్రసారమయి ఉండకూడదు. బ్లాగుల్లో, వాట్సాప్‌ల్లో ఏ ఇతర సోషల్ మీడియా వేదికలలో పోస్టు చేసి ఉండరాదు. ఈ మేరకు హామీపత్రం జత చేయాలి.
కథ కథగా ఉండాలి. అచ్చుతప్పులు ఉండకూడదు. కథ అయి ఉండాలే తప్ప మినీ నవల, నవల కాకూడదు.
కథలను పోటీకి పంపించేవారు తమ పూర్తి చిరునామాను కథతోపాటు పంపించాలి.
కంపోజ్ చేసి పంపించేవారు వర్డ్ ఫైల్‌తో పాటు పిడిఎఫ్ జత చేయాలి. అను ఫాంట్స్‌లోనూ కథలను కంపోజ్ చేసి పంపించవచ్చు.
కథను కాగితాల మీద రాసి పంపించేవారు, ఒక కాపీని మెయిల్ చేసినా విధిగా పోస్టు చేయడం మంచిది. స్కాన్డ్ కాపీలలో స్పష్టత ఉండదు.
` పోటీకి పంపించే కథలు తిరిగి పంపించడం సాధ్యం కాదు. కనుక ఒక కాపీ దగ్గర ఉంచుకోవాలి.
కథల ఎంపికలో పాలపిట్ట సంపాదకవర్గానిదే తుది నిర్ణయం. దీనిపై ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరాలకు తావు లేదు.
పోటీలో ఎంపికయ్యే కథలు పాలపిట్ట లో ప్రచురితమవుతాయి.

**చిరునామా : ఎడిటర్, పాలపిట్ట**
**ఫ్లాట్ నెం:3, బ్లాక్6, ఏపిహెచ్‌బి**
**బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్500044**
**ఫోను: 94900 99327**
**email: palapittamag@gmail.com**
**మీ కథలు మాకు చేరడానికి**
**చివరి తేదీ: 20 అక్టోబర్ 2026**
**ఫలితాల ప్రకటన: 5 నవంబర్ 2026**

## పుస్తక సమీక్షల కోసం...

**తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ దిగువ చిరునామాకు పంపించగలరు.**
**43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034.**

## రచనలకు ఆహ్వానం

**సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు, పుస్తక సమీక్షలు మొదలైనవి..**
**మీ రచనలు పంపాల్సిన చిరునామా haneefsd777@gmail.com**
**whatsapp 9247580946**

# భగ్న ప్రేమలో దగ్ధమైన బినయ్ మజుందార్

పాఠకులారా, నేను ఇప్పుడు రాయబోయేది పద్యంలా రాయడం కష్టం.
అందుకే నేను వచన లో రాస్తాను.
మీరు కూడా ఒక శబ్ద దేవుడు.శబ్ద దేవుళ్ళు ఎలా కనిపిస్తారో మీకు తెలుసు
ఉదాహరణకు మీ పేరు 'అరిందమ్' అనుకోండి. 'అరిందమ్' అనే పదం ఎలా కనిపిస్తుందో మీకు తెలుసు
చాలా కాలం క్రితం నేను కూడా 'న్గున్గు' (ngungu) అనే పదాన్ని ఇదే విధంగా సృష్టించాను, ఆ పదం అచ్చు అయ్యింది.కూడా
మీకు అర్థమయ్యే ఉంటుంది——నేను 'న్గున్గు' అనే కొత్త దేవుడిని సృష్టించాను, ఎందుకంటే ఆ 'న్గున్గు' అనే పదం అంతకుముందు ఎక్కడా లేదు.
మీరు మనుషులైనప్పటికీ, ఈ విధంగా ఒక కొత్త దేవుడిని లేదా దేవతను సృష్టించవచ్చు.
ఒక కాగితం మీద 'న్గాన్గుంగా' (ngangunga) అని రాయండి. ఆకాశం వైపు చూడండి, ఒక కొత్త దేవుడు మీకు కనిపిస్తాడు.
మీరందరూ మనుషులు. ఇప్పుడు మీరు 'న్గు' (ngu) కి బదులుగా 'యింగ్' (yng) ని ఉపయోగిస్తూ ఒక పదాన్ని రాయగలరా?
'యింగాయింగ్' (Yngayng). ఆకాశం వైపు చూడండి. అక్కడ ఒక కొత్త పక్షి వాలి ఉంది. దాని పొట్ట మీద 'కొత్తది' అని రాసి ఉంది. కాబట్టి ఆ పక్షి ఒకకొత్తపక్షి.

మానవుడు తన భాష తన ఊహాశక్తి ద్వారా సృష్టికర్తగా మారగలడు.. ప్రతి పదం ఒక జీవి, ప్రతి శబ్దం ఒక దైవ రూపం. నామకరణం చేయడమంటే ఆకారాన్ని ఇచ్చి సృష్టించడమేనని స్పష్టం చేస్తున్న ఈ కవిత పేరు జీవుల సృష్టి. కవి బినయ్ మజుందార్. 2005 వ సంవత్సరానికి గాను హస్పతలే లేఖ కబితాగుచ్చ (హాస్పిటల్ లో రాసిన కవితా గుచ్ఛం}అనే కవిత్వ సంపుటికి గాను కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం పొందారు.
టాగోర్ అనంతరకాలం లో బెంగాల్ లో తన కవిత్వం తో సంచలనం సృష్టించిన జిబానంద దాస్ కి అచ్చమైన వారసుడు బినయ్ మజుందార్ అని బెంగాలీ కవిత్వ ప్రియులు, కవిత్వ విమర్శకులు బినయ్ ని పరిగణిస్తారు. జిబానంద దాస్ కవిత్వం లో లాగే ప్రాకృతిక సౌందర్యం, అడవులు, నదీ నదాలు ,జంతుజాలం ,తో పాటు మనజీవితం లోని సంక్లిష్ట,సందర్భాలనుండి, మనసులోని చీకటి క్షేత్రాలనుండి తన కవిత్వ వస్తువును ఎక్కువగా ఎన్నుకునే బినయ్ మజుందార్ బెంగాలీ కవిత్వ ప్రపంచం లో అందరికీ అంతగా అర్థం కాని ఒక అస్పష్ట ప్రహేళిక
బినయ్ మజుందార్ 1934లో ప్రస్తుత మైన్మార్ లో జన్మించారు. బంగ్లాదేశ్‌లోని ఫరీద్‌పూర్లోనూ కలకత్తాలోనూ పెరిగారు. దిగువ మధ్యతరగతి కుటుంబంలో అనేక కష్టాలు పడుతూనే 1957లో శిబ్‌పూర్‌లోని బి.ఇ. కాలేజ్ నుండి మెకానికల్ ఇంజనీరింగ్‌లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. ఆయన మొదటి కవితల పుస్తకం 'నక్షత్రేర్ ఆలోయ్' (నక్షత్రాల వెలుగులో) 1958లో ప్రచురితమైంది. 1950లలో బెంగాలీ కవిత్వంలో ప్రధాన చర్చనీయాంశంగా ఉన్న 'కృత్తిబాస్' కవుల రచయితల బృందంతో ఆయనకు సన్నిహిత సంబంధం ఏర్పడింది.
195861 మధ్యకాలంలో ఆయన ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ హైజీన్ అండ్ పబ్లిక్ హెల్త్‌లో కొంతకాలం పనిచేశాక,కలకత్తాలోని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్స్టిట్యూట్‌లో డెవలప్‌మెంట్ ఇంజనీర్‌గా, త్రిపురలోని గవర్నమెంట్ ఇంజనీరింగ్ కాలేజీలో అధ్యాపకుడిగా పనిచేసారు. ఆ తరువాత దుర్గాపూర్ స్టీల్ ప్లాంట్ లో పూర్తికాల ఉద్యోగంలో చేరారు.ఎక్కడా కుదురుగా నిలవని బినయ్ స్టీల్ ప్లాంట్ ఉద్యోగానికి కూడా రాజీనామా చేసి పూర్తికాలం కవిగా ఉండిపోవాలని నిశయించుకున్నారు
శక్తి ఛటోపాధ్యాయ్, సునీల్ గంగోపాధ్యాయ్, సందీపన్ ఛటోపాధ్యాయ్ మలై రాయ్ చౌధురి అనే హంగ్రీ జనరేషన్ కవులు మజుందార్ కి దగ్గరిమిత్రులు.కెన్ ద సబాల్టన్ స్పీక్?అనే పుస్తకం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన పోస్ట్‌కోలోనియల్ సిద్ధాంతకర్త అయిన గాయత్రి చక్రవర్తి స్పివాక్, 196061లో ప్రెసిడెన్సీ కాలేజీలో ఇంగ్లీష్ బి.ఎ. చదువుతున్నప్పుడు మజుందార్ ఆమెతో ప్రేమలో పడ్డారు. సహజంగా బిడియస్తుడు అయిన బినయ్ ఆమెను కొన్నిసార్లు చూడటం తప్ప తాను ప్రేమిస్తున్నాను అనే విషయాన్ని ఆమెకు చెప్పను కూడా చెప్పలేదు.
తిరస్కరణకు గురవుతాననే భయమే మజుందార్‌ను ఆమెతో సంభాషణ ప్రారంభించకుండా నిరోధించి ఉండవచ్చు అని ఆయన మిత్రులు అంటారు. తన ప్రేమను స్వయంగా వెల్లడిచేయలేకపోయిన మజుందార్ ఆమె బంధువులలో ఒకరి చిరునామా సంపాదించి ఒక ఉత్తరం రాశారు. కానీ ఆయన మజుందార్‌ను ఆమెకు దూరంగా ఉండమని సలహా ఇచ్చారు.
గాయత్రీ పైన ఆయనకున్న ప్రేమ ఆయన రెండవ కవితల పుస్తకానికి నాంది పలికింది . మార్చి 1961లో ప్రచురితమైన కేవలం 14 కవితల చిన్న సంకలనం 'గాయత్రికే' (గాయత్రికి) అనే శీర్షికతో వెలువడింది. ఆ కవిత్వ సంపుటిని "అమార్ ఈశ్వరి" (నా దేవతకు) కి అని అంకితం ఇచ్చారు మరుసటి సంవత్సరం మజుందార్ ఆ 14 కవితల పుస్తకాన్ని 77 కవితల తో విస్తరించి 'ఫిరే ఎసో, చాకా' గా మార్చారు.
అయితే, 'గాయత్రికే', 'ఫిరే ఎసో, చాకా' ప్రచురణల మధ్య కాలంలో, 1961లోనే మానసిక ఆరోగ్య సమస్యల వల్ల ఆయన ఆరు నెలల పాటు ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది. ఆ సమయానికి గాయత్రీ చక్రవర్తి





చక్రవర్తి ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిపోయారు.
అయినప్పటికీ, 'ఈశ్వరి' ఆయన రచనలను ఏలుతూనే ఉంది. ఆయన జూన్ 1964లో 79 కవితలతో 'అమార్ ఈశ్వరికే' (నా దేవతకు) అనే పేరుతో ఈ పుస్తకం మూడవ పరివర్ధిత ప్రతిని ప్రచురించారు. ఈ సంస్కరణలో చేర్చిన ముందుమాటలో, ఈ కవితలు తన వేదన గురించి మాత్రమే మాట్లాడినప్పటికీ, దానికి ఒక సార్వజనీనమైన ఆకర్షణ ఉందని మజుందార్ తన చెప్పుకున్నారు. "నా దృక్కోణం నుండి, ఈ కవితల పుస్తకం పూర్తిగా ప్రేమ బాధ గురించినదే," అని ఆయన రాశారు, "ఒక మహిళా మిత్రురాలిని కేంద్రంగా చేసుకుని రాసిన ఈ ప్రేమ వేదన కవితల సంపుటి ఒక సరైన డైరీ."అంటారు మజుందార్. మూడు నెలల తరువాత, సెప్టెంబర్ 1964లో ఆయన 'ఈశ్వరిర్' (దేవత యొక్క) అనే మరొక కవితల పుస్తకాన్ని ప్రచురించారు. ఇందులో *'ఈశ్వరికే'*లోని అన్ని కవితలు ఉన్నాయి. మరుసటి సంవత్సరం, ఆయన 'ఈశ్వరిర్ కబితాబలి' (దేవత యొక్క కవితలు) ప్రచురించారు.
వెన్నెలపై మనకున్న ఈ గాఢమైన అనురాగపు
రూపకథ గురించి చంద్రుడికేమీ తెలియదు
అని ఒక కవితలో రాసారు మజుందార్. చంద్రుడు తన స్వంత సౌందర్యం, ఆ సౌందర్య ప్రభావాన్ని గురించి ఎటువంటి స్పృహ లేకుండా శతాబ్దాలుగా ఎంతోమందిని పిచ్చివాళ్లను చేశాడని చెబుతుంటారు. బినోయ్ మజుందార్‌కి గాయత్రి చక్రవర్తి స్పివాక్ ఒక చంద్రుడిలా నిలిచారు. ఆమె ప్రేరణతో రూపుదిద్దుకున్న కవితా పరంపర, స్వాతంత్ర్యానంతర బెంగాలీ సాహిత్యంలో ఆయనను అత్యంత ముఖ్యమైన కవులలో ఒకరిగా నిలబెట్టింది.
పువ్వుల సౌందర్యానికి మైమరిచిపోయినప్పటికీ,
మనిషి వండుతున్న మాంసం వాసననే అత్యంత ఎక్కువగా ప్రేమిస్తాడు,"
అని ఆయన తన ఒక కవితలో రాశారు.
మరొక కవితలో, "మనిషి దగ్గరకు రాగానే నిజమైన కొంగలు ఎగిరిపోతాయి" అని రాశారు.

నేను నా ప్రేమను ఇవ్వగలను,
మీరు దాన్ని స్వీకరించగలరా?
మీ లీలామయమైన అరచేతుల నుంచి అన్నీ జారిపోతాయి -
నవ్వులు, వెన్నెల, బాధ, జ్ఞాపకాలు, ఏదీ మిగలదు
అని ఫిర్ ఏసో చాకా లో రాసుకున్నారు మజుందార్. ఫిర్ ఏసో చాకా అంటే తిరిగి రా ఓ చక్రమా అని అర్థం. చాకా అనే పదాన్ని గాయత్రి చక్రవర్తి లోని చక్ర నుండే తీసుకున్నాడు మజుందార్. గాయత్రీ అంటే ఆయనకు అంత ప్రేమ
బినయ్ జీవితం, రచనలు లోతైనవి. ఆయన రచనలలో ఒక తీవ్రమైన గాఢత,పవిత్రత కనిపిస్తుంది. రేఖాగణితం, గణితం, విజ్ఞాన శాస్త్రం తర్కం ఒక విశిష్టమైన భావావేశపు శైలి తో జతకడతాయి. లైంగికతను బినయ్ ధైర్యంగా, విప్లవాత్మకంగా చిత్రీకరించడం ఆయన కవిత్వానికి ఆసక్తికరమైన ఫ్రాయిడన్ కోణాన్ని చేకూర్చింది. ఆయన 'అమార్ భుట్టాయ్ తేల్' (నా నూనె రాసిన జొన్న పొత్తు) వంటి కవితల పరంపరలో శృంగార చిత్రణను స్పష్టంగానూ,విస్తృతంగా చేశారు. లైంగిక కలయికను అత్యంత కావ్యత్మకంగా చెపుతూ సహజీవన ప్రక్రియ యొక్క శారీరక స్వభావాన్ని నొక్కి చెప్పారు
"నేను మూడు అడుగులు వెనక్కి వేసి దెబ్బతిన్నాను
ఆవిష్కరణ ఊపుతో ముందుకు సాగాను
నీ ఆలోచన మనస్సుకు అందుబాటులో లేనట్లు కనిపించినా
తోకచుక్కలా పీరియాడికల్‌గా తిరిగి వస్తుంది".
బినయ్ కవిత్వంలో ప్రేమ విరహం ప్రధాన ఇతివృత్తాలు. కానీ కాలం గడిచేకొద్దీ విరహ భావం మరింత తీవ్రమైంది;
"అనుభవం నుండి ప్రారంభించి
నేను నిన్ను మెల్లగా తెలుసుకున్నాను
వర్ణరహిత ఆకాశ వార్తలా"
వంటి పద్యాలలో విరహ తీవ్రతను చూడవచ్చు.
బినోయ్ 1974 లో "అఘ్రాణేర్ అనుభూతిమాలా" రాసి ప్రచురించారు. ఇది ఆరు సుదీర్ఘ కవితల సంకలనం. ప్రకృతి నిశ్శబ్దంగా ఎలా పనిచేస్తుందో నమోదు చేస్తూ ఉండే ఒక ఏకాకి మానవుడి ఒంటరితనాన్ని ఈ కవితలు మనకు చెప్తాయి. ఈ కవితలన్నీ బెంగాలీ నెల అయిన "అఘ్రాన్" ( శరదృతువు/ హేమంత రుతువు) లో రాశానని , అందుకే దీనికి "అఘ్రాణేర్ అనుభూతిమాలా" అని పేరు పెట్టానని బినయ్ ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. తరువాత, బినోయ్ "బాల్మీకిర్ కబితా" అనే మరొక పుస్తకాన్ని ప్రచురించారు, అది అశ్లీలత కారణంగా నిషేధించబడింది. ఆ కవితలు రాసినందుకు బినోయ్ తరువాత క్షమాపణలు చెప్పారు.
బెంగాలీ కవిత్వంలో బినోయ్ ఒక గుర్తింపు పొందని కథానాయకుడు. మన తరం పాఠకులకు ఆయన కవితా ప్రావీణ్యం గురించి పెద్దగా తెలియదు. తెలిసిన వారు కూడా ఆయన కవిత్వాన్ని చాలా సాధారణ కోణంలోనే చూస్తారు. మనం సాంప్రదాయ పఠన విధానాల బంధనాలను తెంచుకుని ఆయన పద్యాల లోతుల్లోకి వెళ్లాలి.



మజుందార్

చివరకు ఆయన ఒక ఏకాకిగా తనదయిన లోకంలోకి వెళ్లిపోయారు.ఉద్యోగం చేయలేదు, పెళ్లి చేసుకోలేదు, ఏ శృంగార బంధంలోనూ బంధితుడు కాలేదు.1980లలో తన తల్లిదండ్రులు మరణించే వరకు వారితోనే ఉన్నారు, ఆ తర్వాత 2006లో తను మరణించే వరకు ఒంటరిగానే జీవించారు. ఆయన తరచూ రాయడం ఆపేసేవారునెలల తరబడి, సంవత్సరాల తరబడి. కానీ బెంగాల్‌లోని వివిధ ప్రాంతాల నుండి వెలువడే సాహిత్య ప్రచురణల సంపాదకులు ఆయనను రాయమని కోరుతూనే ఉండేవారు . ఆయన 1974 కవితా సంకలనం 'అఘ్రాణేర్ అనుభూతిమాలా' పురాణ స్థాయి హోదాను పొందిన మరొక పుస్తకంగా మారింది.
ఆయన జీవితంలోని చివరి 1012 సంవత్సరాలలో, రాష్ట్ర ప్రభుత్వం ఆయనకు నెలకు పింఛను చెల్లించింది. కలకత్తాకు చెందిన కొందరు రచయితలు, కవులు మజుందార్ ఇరుగుపొరుగు వారితో మాట్లాడి ఆయన సంరక్షణ చూసుకునేలా ఏర్పాట్లు చేశారు. ఆయనకు 2005లో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ అత్యున్నత సాహిత్య పురస్కారం 'రవీంద్ర స్మృతి పురస్కారం', అలాగే 'సాహిత్య అకాడమీ అవార్డు' లభించాయి.
గాయత్రి ఆయనకు శాశ్వత ప్రేరణగా నిలిచారనిపిస్తుంది. 2003 నాటి చివరి రోజుల్లో కూడా ఆయన "ఆమ్రా దుజొనే మిలే జితే గేఛి బోహుదిన్ హోలో" అనే కవితను రాశారు. విమర్శకులు ఇది చక్రవర్తి గురించేనని భావించారు. తెలుగులోకి అనువదిస్తే ఇది ఇలా ఉంటుంది:

**మనమిద్దరం**
మనమిద్దరం ఎప్పుడో గెలిచాం
నీ చర్మ ఛాయ మారలేదు,
కానీ నమ్మకం హిందూ మతం నుండి క్రైస్తవానికి మారింది.

నువ్వు, నేను వృద్ధులమయ్యాం
దినపత్రికల్లో ప్రచురితమైన ఛాయాచిత్రాల్లో చూశాను,
నువ్వు
నీ జుట్టును పొట్టిగా కత్తిరించుకున్నావు నాలాగే

మనం చిన్న వయస్సులో ఉన్నప్పుడు
మనకు పెద్దవాళ్లమవుతామని తెలుసా?
ఇప్పుడు నీకు పిల్లలు, మనవళ్లు
ఉన్నారని ఆశిస్తున్నాను,

నీ దగ్గర నా చిరునామా ఉంది
నా దగ్గర నీది ఉంది

మనం ఒకరికొకరం ఉత్తరాలు రాసుకోము.
మనం పుస్తకం పేజీల్లో కలిసి జీవిస్తాం.

బినయ్ మజుందార్ లేని లోటు సాధారణమైనదేమీ కాదు.తన కవిత్వ ప్రేమికులను ఆ లోటు వెంటాడుతూనే ఉంటుంది

**వంశీకృష్ణ**
**9573427422**

# జీవన భరోసాలు కవన వాక్యాలై....

మానవ జీవితాల్ని ఎన్నో అలజడులతో అతలాకుతలం చేస్తూ సంఘర్షణకు దారితీసే సామాజిక రుగ్మతలను చీల్చిచెండాడే బృహత్తర బాధ్యతను ఆధునిక కవిత్వం నిర్వర్తిస్తూనే వుంటుంది. కవిదృష్టి ఒకప్పుడు ఆత్మానందానికి మాత్రమే సంబంధించింది అయివుండేది. అయితే ఇప్పుడది సామాజికదృష్టి అయింది. ఒక కవి చుట్టూ అల్లుకున్న సామాజిక స్థితిగతులు అతనిలో రేపే అలజడి అతని సామాజికదృష్టిని తీవ్రతరం చేస్తుంది. ఆ అలజడి అక్షరాలసడికి దారితీసి చదువరి మనసును చైతన్యపు జడిలో ప్రవహింపజేస్తుంది. ఆ అక్షరాల సడిలో పయనిస్తూ తన చుట్టూ వున్న సంక్షుభిత సామాజిక పార్శ్వాలను స్పృశిస్తూ, వైవిధ్యభరితమైన అంశాల్ని కవితావస్తువులుగా స్వీకరిస్తూ చిరకాలంగా కవనకదనం చేస్తున్న వర్తమాన కవి చిన్ని నారాయణరావు. పలు జీవన భరోసాలను అక్షరాలుగా కూర్చి రేపటి వెలుగు వసంతం కోసం కలగంటూ ఈ కవి తాజాగా వెలువరించిన కవితాసంపుటి 'వెలుగుపూల వసంతం'.
జీవితాల్ని క్రుంగదీసే అనేక సామాజిక అవలక్షణాల్ని ఎత్తిచూపుతూ, మానవతాధారల్ని కురిపించే కారుణ్య మేఘాలను సృష్టించే హృదయతొలకరుల కోసం తపిస్తూ ఈ కవి గతంలో జీవితం ఓ విజయం, అంతర్ముఖం, గండెదీపం, గంపకూడు కవితాసంపుటాలను వెలువరించాడు. మనిషిని ఆవహించిన వైపరీత్యాల దాహాన్ని బట్టబయలు చేసిన 'దాహం.. దాహం', మాటతో మనిషితనాన్ని అలంకరించుకోవచ్చని ఉద్బోధించే 'మాట' అనే దీర్ఘకవితలు ఈ కవి కలం నుంచి వెలువడ్డాయి. ఇప్పుడు నిత్యజీవితంలోని అనేక పార్శ్వాలను స్పృశిస్తూ, మనిషి జీవనవికాసానికి సోపానాలయ్యే కవితావాక్యాలను కవి ఈ సంపుటిలో ఆవిష్కరించాడు. అందుకే పల్లెకాంతిని ద్విగుణీకృతం చేసే దారిదీపం లాంటి సేద్యగాడి సుక్షేత్రాల దార్శనికత, మనిషిని ఆక్రమించుకొని అతని బతుకును చితిగా మార్చుతున్న ప్రపంచీకరణ, మానవజీవితాన్ని పండించే అపురూప శాసనమై చూపుడు వేలే ఆయుధంగా రాజకీయ చైతన్యం కలిగించే ఓటు, మనిషిలోని ఆత్మన్యూనతను పొగొట్టి ఆత్మవిశ్వాసాన్నిపాదుగొలిపే పుస్తకం, యువత జీవితాలను తేజోమయం చేసే అక్షయదీపం లాంటి సాఫ్ట్ వేర్, అతీత శక్తుల మాయాజాలంతో మనిషిని వశపరచుకొని అతనిచేత నేరాలు, ఘోరాలు చేయించే సెల్ ఫోన్, మనుగడ కోసం మనిషి నిరంతరం ఈదులాడే పచ్చనోట్ల సముద్రం, ప్రజాసంక్షేమాన్ని క్రుంగదీసే పన్నుల భారం, శూన్యంలో సైతం సైకత వేదికలు నిర్మించి నిర్మాణాత్మక శోభగా పల్లవించి చిగురులు తొడిగే ఉద్యోగినుల సాధికారత, ఆత్మీయతా





పరిభ్రమణాలతో, ఆత్మీయతల అల్లికతో కుటుంబవ్యవస్థను పటిష్టం చేసే ఇల్లు... ఇవన్నీ ఈ కవికి కవితావస్తువులయ్యాయి.
ఆడిటింగ్ రంగంలో రాణిస్తున్నఈ కవి వాణిజ్యం పట్ల సమగ్ర అవగాహనతో తన కవిత్వంలో వ్యాపార రంగంలోని లోపాల్ని బట్టబయలు చేస్తాడు. కార్పొరేట్ రంగం స్వైరవిహారంతో అమ్మకాలు లేక చతికిలబడ్డ చిన్న వ్యాపారుల పక్షాన నిలబడతాడు. 'దుకాణం దిగులు పడ్డది/దిగులు మేఘమై కలత చెందింది/ జగజ్జేయమాన దివిటీల/కాంతిసెగల మధ్య అతిశీతలీకరణాల అలంకార/మకుటాయమాన పరంపరల్లో/ దుకాణం వెక్కి వెక్కి ఏడ్చింది'(దిగులు మేఘం) అంటూ చిన్న వ్యాపారుల ఆవేదనను కవిత్వీకరిస్తాడు. వ్యాపార యవనికపై తారగా వెలుగొందాల్సిన గుత్తేదారు పరిస్థితుల ప్రబావంతో బ్యాంకు రుణాలకు ఉరివేయబడే దీనస్థితిని వర్ణిస్తాడు. వైఫల్యం డమరుకాల మధ్య ప్రజాబాహుళ్యంపై నిప్పులు కురిపిస్తున్న ట్యాక్స్ టెర్రరిజంపై ధ్వజమెత్తుతాడు. 'పుస్తకాలు మానవ దిక్సూచికలు/ మార్గదర్శనం చేసి ముందుకు నడిపించే నేస్తాలు/ జ్ఞానతృష్ణను తీర్చే చలివేంద్రాలు' అంటూ పుస్తకాలకు సలాము చేస్తాడు. తన ఊపు ఒరవడిబాకుతో ఆఫీసు ఫైళ్లన్నింటినీ నడక పందాలుగా పరుగులెత్తించే మహిళాసాధికారతను చాటిచెబుతాడు. విధ్వంస రచనలతో రక్తతర్పణం జరిగే రోడ్డు అద్దంలో మనిషి జీవనబింబం రేరాజులా ఉద్భవించిననాడే సమాజం సౌందర్యవంతమవుతుందని ఉద్బోధిస్తాడు.
అట్టడుగు వర్గాల జీవన సౌందర్యాన్నీ ఈ కవికలం స్పృశించింది. 'వెలుగు కోసం కళ్ల టార్చిలైట్ల వెలుగు/ రెక్కలు వెదజల్లి/పూలసజ్జతో ధనుర్ధారియై/సత్యాసుర సమరంగా ఆశ్రయంగా/సైకిలెక్కి దేవాలయ గోపుర/ కదనరంగానికి బయల్దేరింది'(పూలతల్లి) అంటూ పూలమ్మిని వర్ణిస్తూ ఆమె చెమట చిత్తరువులో పూల రుతువును దర్శిస్తాడు. 'విహాయసం నీడలో/ఉదధి తోడుగా/ప్రస్థానించే జాగృత హస్తం వాళ్లది/బ్రతుకు అలల మధ్య లంగరందక/తెరచాప నేస్తాన్ని ఎంచుకున్న/ధదీచులు వాళ్లు'(ప(ని)డవజీవులు) అంటూ జాలర్ల జీవనయానానికి కవిత్వపు సొబగులు తొడుగుతాడు. కుటుంబవ్యవస్థ సౌందర్యాన్ని వర్ణించిన ఈ కవి 'ప్రతి ఉదయం తపోనిష్టతో/సూర్యోదయమంత గాఢంగా/ గుండెల్లో ప్రతిధ్వనిస్తుంది/అందులో పరితాపం ఉండదు/అమృతధారల్ని కురిపించే అరుణిమ తప్ప... నాన్నంటే ఉక్కుపాదం... నాన్నంటే దారిదీపం'(నాన్నంటే) అంటూ ఎన్నో కుటుంబ భారాలను మోసే నాన్నకు నీరాజనాలర్పిస్తాడు. 'మధ్యతరగతి మందహాసజీవుడు/మధ్యందిన మార్తాండుడు కాలేక/వెలవెలపోయి కూలిపోయిన వంతెన'(కూలిన వంతెన) అంటూ మధ్యతరగతి జీవి జీవన విధ్వంసాల్ని వర్ణిస్తాడు. 'సరుకుల్నీ, సేవల్నీ వ్యాపారం చూస్తాం/కానీ రోగాల్నీ, రోగుల్నీ అమ్ముకొనే వ్యాపారం ఓ మాయల చింత' అంటూ కార్పరేట్ పెనుమాయలో చిక్కి వైద్యం వ్యాపారమైపోవడాన్ని దునుమాడతాడు.
ఈ కవిత్వంలో కవి వైవిధ్యమైన వస్తువుల్ని స్పృశించాడు. 'చీమల బారులై/దిగులు వానలో తడుస్తున్నారు/దుఃఖ వాక్యమై కునారిల్లుతున్నారు'(ఆమెకోసం) అంటూ వయసు పైబడిపోతున్నా సామాజిక పరిస్థితుల దృష్ట్యా వివాహానికి నోచుకోని అనేకమంది పెళ్లికాని ప్రసాదుల దీనస్థితిని వర్ణిస్తాడు. 'అతడి చిత్రరేఖలు/పాప కన్నుల్లో మెరుపులను బంధించి/పోటీగా పోటీపడుతున్నాయి/ పెదవులపై తన్మయత్వం పూచి/పాపను తడిమింది ఆటాడుకుందాం రా అంటూ'(బతుకు తపస్సు) అంటూ చిత్రాలు గీయడంలో ఒక చిత్రకారుని తపోనిష్టను కవిత్వీకరిస్తాడు. రంగురంగుల సీతాకోకచిలుకల్లాంటి రంగవల్లులద్దే అపూర్వ ఆభరణంగా పెన్సిల్ ను అభివర్ణిస్తాడు. ఈ సంపుటిలోని పలు కవితావాక్యాలు ఆత్మవిశ్వాసాల భరోసాలను ప్రసరింపజేస్తాయి. శూన్యంలో సైతం స్వప్నాల్ని పండించే మనిషిని పురోగామిగా ప్రణమిల్లజేస్తాయి. మనిషిలో ఆత్మస్థైర్యాన్ని నింపే దిశగా 'నేను మహాసముద్రాన్ని/అలలకల్లిని కంటుంటాను/ మానవీయ మార్గానికి తెరచాప ఎత్తి/కొత్త ఉదయం కోసం వెలుతురు వాకిలి తెరుస్తాను'(వెలుతురు వాకిలి) అంటూ ఈ కవి కలం మనిషితనాన్ని కలగంటుంది. ద్వేషం గూడు కట్టుకుంటున్న గుండెల్లో ప్రేమవాక్యం చిగురింపజేయాలని, మాటల దివిటీల్లో జాగృత దీపం వెలిగించాలని ఈ కవి కవితావాక్యాలు తపిస్తున్నాయి. ఆత్మవిశ్వాసపు రెక్కలు తొడుక్కొని మనోవిహాయసాల్లో విహరించే విహంగాలు ఈ కవితాక్షరాలు.

**డాక్టర్ కొత్వాలు అమరేంద్ర,**
**9177732414**

## ఇంకెవరినో

ఏమీ లేనిచోటుకు వచ్చి
అదేపనిగా మూలమూలలూ వెతుకుతుంటాం
అంతా నడిచేదై
ఆగేదేదీ లేదని తెలిసీ
కాలాన్ని ఓ చెట్టుకు కట్టేయాలని
ఒకింత సేదతీరాలని అనుకుంటాం.
మన కళ్ళకి నిజమే కనిపించినా
మనసుతో నిలువరించాలని
విఫలమవుతూ విలపిస్తూ...
మన గమనంలోంచి
విశ్రాంతి మైనస్ అవ్వదు
నివురు గప్పిన నిప్పు రగులుతూనే ఉంటుంది
మనం నిద్రపోయినా
కాలం నడుస్తూనే ఉంటుంది
మనం కట్టేసిన కాలగమనం ఒక భ్రమ అని తెలిసే
టప్పటికే
పొద్దు తల్లికడుపులో పడుతుంది.
కీర్తిశేషులకు వచ్చే అవార్డులానే
మన అవశేషం ఇంకెవరినో జోకొడుతుంది



**ఏనుగు నరసింహారెడ్డి**
**8978869183**

## మాతృహృదయం

ఎక్కడో దూరాన ఓ తల్లి పాడుతుంది
అది జోల కాదు
వేదనా రుధిర ప్రవంతి_
ప్రపంచంలో బాధలన్నీ అందులో
అల్లుకున్నె_
యుద్ధంలో పేలిన ప్రతి గుండూ
ఒక గాయం చేస్తుంది
అదే మాతృహృదయం
ఎవరు గెల్చినా
ఎవరు ఓడినా
మాతృహృదయం బ్రద్దలవుతుంది

**కోటం చంద్రశేఖర్ 9492043348**
( సోవియట్ కవి కైసిన్ కులీవ్ కవిత ఆధారంగా)




# తెలంగాణ ఉద్యమాల్లో కొండా లక్ష్మణ్ బాపూజీ కీలక పాత్ర

- **బల్దియా అదనపు కమిషనర్ జోనా**
- **ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు**

**వరంగల్, కార్పొరేషన్ మహా :** మాజీ మంత్రి, తెలంగాణ ఉద్యమ నాయకుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతిని పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో జయంతి వేడుకలు నిర్వహించారు. అదనపు కమిషనర్ జోనా, అధికారులు బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా అదనపు కమిషనర్ జోనా మాట్లాడుతూ, స్వాతంత్ర్యోద్యమం, తెలంగాణ ఉద్యమాల్లో కొండా లక్ష్మణ్ బాపూజీ కీలక పాత్ర పోషించారని తెలిపారు. తెలంగాణ కోసం 1969లో మంత్రి పదవిని సైతం త్యజించిన నిబద్ధత కలిగిన నాయకుడిగా ఆయన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఎస్ఈ రాజ్‌కుమార్, సీఎంహెచ్ఓ లక్ష్మారెడ్డి, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, సమ్మయ్య, సెక్రటరీ అనిల్‌బాబు, ఆరోగ్యాధికారి డా. రాజేష్, హార్టికల్చర్ అధికారి ప్రశాంత్, సూపరింటెండెంట్లు బాకం సంతోష్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- **వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**




**వరంగల్, ఎంజీఎం మహా :** వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో నిర్వహించిన "నశా ముక్త్ యువ - వికసిత్ భారత్" 100 వారాల నశా ముక్త్ యువ అభియాన్లో భాగంగా ఏర్పాటు చేసిన ఆరోగ్య, అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు. ఈ కార్యక్రమం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజి రెడ్డి, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ కుమార్ రెడ్డి, ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ వెంకన్న తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాల పై విద్యార్థులు, యువతలో విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

**యోగ, ధ్యానంతో మానసిక ప్రశాంతత**

ప్రతి ఒక్కరూ నిత్యం యోగ సాధన, ధ్యానం చేయడం ద్వారా మానసిక ప్రశాంతతతో పాటు సత్ప్రవర్తనను అలవర్చుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా వ్యసనం మనిషిని క్రమంగా బానిసగా మారుస్తుందని, దానికి లోనుకాకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు.

**యువత విద్య, క్రీడల్లో రాణించాలి**

మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా ప్రతి ఒక్కరూ తమకు తామే బాధ్యత వహించడంతో పాటు, తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, తోటి విద్యార్థులను కూడా చైతన్య పరచాలని కలెక్టర్ సూచించారు. యువత తమ శక్తి, సామర్థ్యాలను విద్య, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి, సమాజ సేవ వంటి సానుకూల కార్యక్రమాల వైపు మళ్లించాలని అన్నారు. మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణానికి ప్రభుత్వ శాఖలతో పాటు విద్యాసంస్థలు, వైద్యులు, తల్లిదండ్రులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని ఆమె పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు మరొక్కరితో పోచుకోనుండా.. మన సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా వాల్ పోస్టర్ రిలీజ్ తో పాటు ప్రతి ఒక్కరి తో ప్రతిజ్ఞ చేయించారు.



# కాంగ్రెస్ ఆధ్వర్యంలో.. ఘనంగా బాపూజీ జయంతి..

**బాపూజీ ఆశయాలను కొనసాగించాలి..**

**మణుగూరు, మహా:** తెలంగాణ ఉద్యమనేత, స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పిరినాకి నవీన్ ఆధ్వర్యంలో ఆదివారం మణుగూరులో బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ప్రజల హక్కులు, సామాజిక న్యాయం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం బాపూజీ జీవితాంతం పోరాడారని కొనియాడారు. స్వాతంత్ర్య సమరంతోపాటు తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆయన పోషించిన పాత్ర స్ఫూర్తిదాయకమన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన చూపిన చిత్తశుద్ధిని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య విలువలు, సమానత్వం, అన్ని వర్గాల సంక్షేమం కోసం ఐక్యంగా పనిచేయడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పిరినాకి నవీన్, సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, జిల్లా కార్యదర్శి దొబ్బల వెంకటప్పయ్య, శివాలయం చైర్మన్ కూచిపూడి బాబు, జీవి, మహిళా అధ్యక్షురాలు కూరపాటి సౌజన్య, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు పోడుతూరి రవి, 14 టైర్ యూనియన్ నాయకుడు తుపూడి శ్రీను, గుమాస్తాల సంఘం అధ్యక్షుడు తాత ప్రసాద్, మండల నాయకులు టీవీ సుబ్బారెడ్డి, తమ్మిశెట్టి సాంబ, దొడ్డపనేని మధు, కొమరం రామూర్తి, బత్తుల శ్రీను, యాకుబ్ అలీ, కోర్లకుంట అప్పారావు, లవకుమార్, మాధురి, స్వరూప, ద్వాలి, పార్టీ కార్యకర్తలు, యువజన, మహిళా నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.



# తెలంగాణ ఉద్యమాలకు ఊపిరి కొండా లక్ష్మణ్ బాపూజీ

- **ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, కుడా చైర్మన్ గుండు సుధారాణి**
- **నగరంలో ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి ఉత్సవాలు**

**వరంగల్, బ్యూరో మహా :** ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి ఉత్సవాలను బి.సి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వరంగల్‌లోని గోపాలస్వామి గుడి సమీపంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఐఏఎస్, కుడా చైర్మన్ గుండు సుధారాణి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, లు పాల్గొని ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా వాళులర్పించారు. బాపూజీ తెలంగాణ ఉద్యమం, సామాజిక న్యాయం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి చేసిన సేవలను ఈ సందర్భంగా చుకున్నారు. ఈ కార్యక్రమం లో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి పుష్పలత, వరంగల్ ఆర్డీవో సుమ, వరంగల్ తహసిల్దార్ శ్రీకాంత్, ప్రజాప్రతినిధులు, అధికారులు, బీసీ సంఘాల నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి కొండా లక్ష్మణ్ బాపూజీ

**బిజెపి జిల్లా అధ్యక్షులు,రాష్ట్ర నాయకులు**



**వరంగల్, పోచమ్మ మైదాన్ మహా;** స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు, వెనుకబడిన వర్గాల ఆత్మబంధువు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలు బిజెపి ఓబీసీ మోర్చా వరంగల్ జిల్లా అధ్యక్షులు కూచన క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం కొత్తవాడ జంక్షన్ లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, బిజెపి రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి వన్నాల వెంకటరమణ హాజరై కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం తన జీవితాంతం పోరాడిన మహోన్నత వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాయుధ పోరాటంలో పాల్గొనడమే కాకుండా, మలిదశ తెలంగాణ ఉద్యమంలో ప్రత్యేక రాష్ట్రం కోసం తన మంత్రి పదవినే త్యాగం చేసిన నిష్కళంక దేశభక్తుడు ఆయన అని , చేనేత రంగానికి అభ్యున్నతికి, కార్మికుల సంక్షేమానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. బాపూజీ ఆశయాలను కేవలం సభలకే పరిమితం చేయకుండా, నేటి యువత ఆయన పోరాట స్ఫూర్తితో సమసమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. ఆయన చూపిన బాటలో నడుస్తూ బలహీన వర్గాల హక్కుల కోసం బిజెపి ఎల్లప్పుడూ ముందుంటుందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్ షా, సిద్ధం నరేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, బిజెపి రాష్ట్ర నాయకులు త్రిలోకేశ్వరరావు, బైరి మురళీకృష్ణ, ముండ్రాతి వెంకటేశ్వర్లు, బైరి శ్యాంసుందర్, ఓబిసి మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శులు కర్నె రవీందర్, విక్రం, భాస్కర్, బండి సుజాత, శివప్రసాద్, జిల్లా నాయకులు గుర్రాల చంద్రమౌళి, కొంతం సంగీత్, కోమాకుల నాగరాజు, గుర్రపు సత్యనారాయణ, కాశిబుగ్గ మండల అధ్యక్షులు అపురూప సాయి, గుంతిక శ్రీధర్, వల్లెల రమేష్, శోభా మరియు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఉద్యమకారులను గౌరవించుకుంటాం

- **ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య**
- **మోతే శోభన్ రెడ్డి**
- **గుర్తింపు కమిటీ సభ్యులు**

**యాదాద్రి భువనగిరి మహా న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వము తెలంగాణ ఉద్యమకారులను గౌరవిస్తున్నదని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు ఆదివారం యాదగిరిగుట్టలో జరిగిన ఉద్యమకారుల ఫోరం 9వ ఆవిర్భావ వేడుకలకు ముఖ్య అతిథి హాజరై మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యమకారుల న్యాయమైన డిమాండ్ నెరవేర్చడానికి గుర్తింపు కమిటీని కూడా వేయడం జరిగిందని త్వరలో ఉద్యమకారులను గుర్తించడానికి ప్రత్యేక వెబ్సైట్ ప్రారంభిస్తామని అన్నారు. ఉద్యమకారుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తొందరలో సమస్యకు పరిష్కారమయ్యే దిశగా ప్రయత్నం చేస్తానని ఉద్యమకారులకు అండగా ఉంటానని అన్నారు ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యులు మోతే శోభన్ రెడ్డి రాష్ట్ర సాంస్కృతిక సారధి చైర్మన్ వెన్నెల మాట్లాడుతూ ఉద్యమకారుల కోసం ప్రభుత్వం కమిటీ వేసిందని తొందరలో ఉద్యమకారుల డిమాండ్ నెరవేరబోతున్నామని అన్నారు ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉద్యమకారుల డిమాండ్లు నెరవేర్చి గౌరవిస్తే మరో 10 సంవత్సరాల కాలం పాటు కాంగ్రెస్ పార్టీని ఉద్యమకారులు కాపాడుకుంటారని అన్నారు ఈ కార్యక్రమంలో ప్రజా నాయకుడు గాదె ఇన్నయ్య రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు జ్యోతి రెడ్డి ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులుజోగు అంజయ్య గుండేటి ఐలయ్య జిల్లా అధ్యక్షులు కోలను శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు

# 'ఏరియా వచ్చింది.. సౌకర్యాలు ఎక్కడ?"

- **సత్తుపల్లి కార్మిక కుటుంబాల వసతులపై ఐఎన్‌టీయూసీ వినతి..**
- **61 మంది ఈపీ ఆపరేటర్ల ప్లేడే మస్టర్ నమోదుకు డిమాండ్"**

**సత్తుపల్లి, మహా :** సింగరేణి సత్తుపల్లి ఏరియాలో కార్మికులు, వారి కుటుంబాలకు మౌలిక వసతులు కల్పించి, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ నాయకులు కోరారు. ఈ మేరకు ఏరియా వైస్ ప్రెసిడెంట్ బి. కోటేశ్వరరావు శనివారం డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కొప్పుల వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించారు. సెక్రటరీ జనరల్, కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ డా. జనక్ ప్రసాద్ సూచనలతో, సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజన్ ఆధ్వర్యంలో ఈ భేటీ జరిగినట్లు కోటేశ్వరరావు తెలిపారు. సత్తుపల్లి ఏరియా అభివృద్ధి, కార్మికుల సమస్యలను డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు.

**ఈపీ ఆపరేటర్ల ప్లేడే మస్టర్ నమోదు చేయాలి**

ప్రత్యేక అనుమతితో 2026 ఫిబ్రవరి 1న ప్లేడే నిర్వహించిన 61 మంది ఈపీ ఆపరేటర్ల మస్టర్‌ను వెంటనే నమోదు చేయాలని కోరారు. సత్తుపల్లి ఓసీ3 బ్లాక్‌ను సింగరేణి సంస్థకే కేటాయించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**కార్మిక కుటుంబాలకు సౌకర్యాలు అవసరం**

సత్తుపల్లి ఏరియా ఆవిర్భావాన్ని దృష్టిలో ఉంచుకుని క్రీడామైదానం, ఈతకొలను, పార్కు, బహిరంగ వ్యాయామశాల, ఏరియా ఆసుపత్రి ఏర్పాటు చేయాలని నాయకులు కోరారు. ఏరియా జీఎం కార్యాలయంలో అన్ని విభాగాలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చి పరిపాలనా సేవలను మెరుగుపరచాలని సూచించారు. వినతిపై డైరెక్టర్ కొప్పుల వెంకటేశ్వర్లు సానుకూలంగా స్పందించి, సమస్యలను పరిశీలించి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కోటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ పితాంబరం, ఇక్బాల్, కార్తీక్ పాల్గొన్నారు.

# కారు–బైక్ ఢీ.. వ్యక్తి మృతి

**పెద్దపల్లి మహా :** కాల్వ శ్రీరాంపూర్: మండలంలోని పెగడపల్లి-నాంసానిపల్లి రహదారిపై ఆదివారం కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో నాంసానిపల్లికి చెందిన ఈరవేని సమ్మయ్య (54) మృతి చెందాడు. బైక్‌పై పెగడపల్లి వెళ్తుండగా ప్రమాదం జరిగినట్లు ఎస్సై గట్ల సుధాకర్ తెలిపారు. కారును కనగర్తికి చెందిన మెరుగు యువన్ కుమార్ (22) నడుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



# ఆకలి తీర్చే సేవా గుణం గొప్పది

- **ప్రతి ఒక్కరిలో సేవ చేయాలనే తపన ఉండాలి**
- **యామిని ఆసుపత్రి వైద్యురాలు యామిని కుమారి**
- **మధుర బస్తీలో "మహా అన్నదానం" సక్సెస్**
- **పోటెత్తిన ప్రజలు.. అందరికీ అన్న ప్రసాదం**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** ఆకలి తీర్చే సేవ కంటే గొప్ప సేవ మరొకటి లేదని యామిని మల్టీస్పెషాలిటీ ప్రముఖ పిల్లల వైద్యురాలు సిరిశెట్టి యామిని కుమారి అన్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మధురబస్తీలో రాజేందర్ మెమోరియల్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం మహా అన్నదాన కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. తొలుత లక్ష్మీగణపతి మందిరంలో విగ్రహదాతలు దుగ్గి శివప్రసాద్ దంపతులు విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని డాక్టర్ యామిని కుమారి ప్రారంభించి మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా రాజేందర్ మెమోరియల్ యూత్ సభ్యులు, మధుర బస్తీ భక్త బృందం ఎంతో భక్తి శ్రద్ధలతో గణనాథుని నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తూ వస్తున్నారని గణేష్ నిమజ్జనం అనంతరం పవిత్ర గోదావరి నదీ తీరంలో నిమజ్జనం తర్వాత మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగించడం అభినందనీయమన్నారు. ఇంత పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించిన రాజేందర్ మెమోరియల్ యూత్ సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు, మధురబస్తీ భక్త బృందం సభ్యులను వారు అభినందించారు. ఈ మహా అన్నదాన కార్యక్రమంలో యామిని హాస్పిటల్ ఆర్థోపెడిక్ వైద్యులు నరసింహ సంజీవ్ రావు, జైభీమ్ రావ్ భారత్ పార్టీ(జేబీపీ)స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్, యెర్రా లింగేష్, ఎడారి లక్ష్మణ్, కనగాల లక్కి, జంగం జస్వంత్, ధనుంజయ్, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.



# సత్తుపల్లి ఆరు వార్డుల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం

**రూ.3 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు..**
**మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం: ఎమ్మెల్యే రాగమయి**

**సత్తుపల్లి, సెప్టెంబర్ 27: మహా :** సత్తుపల్లి మున్సిపాలిటీలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. పట్టణంలోని ఆరు వార్డుల్లో సుమారు రూ.3 కోట్లతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆదివారం రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్‌తో కలిసి ఆమె శ్రీకారం చుట్టారు. 7వ వార్డులో రూ.50 లక్షలు, 9వ వార్డులో రూ.41 లక్షలు, 16వ వార్డులో రూ.40 లక్షలు, 19వ వార్డులో రూ.50 లక్షలు, 20వ వార్డులో రూ.50 లక్షలు, 23వ వార్డులో రూ.50 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టారు. ఆయా వార్డుల్లో ప్రజలకు దీర్ఘకాలంగా అవసరమైన రహదారులు, మురుగు కాలువల నిర్మాణానికి నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ పట్టణ అభివృద్ధిలో ప్రజల అవసరాలకే తొలి ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. ప్రతి వార్డులో మౌలిక వసతులను మెరుగుపరిచి, ప్రజలకు మెరుగైన జీవన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమన్నారు. అభివృద్ధి పనుల విషయంలో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని, పనులు వేగంగా పూర్తయ్యేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజల అవసరాలను గుర్తించి దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని మట్టా దయానంద్ తెలిపారు. పట్టణంలోని మిగిలిన ప్రాంతాల్లోనూ అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహ, మున్సిపల్ చైర్మన్ రోహన బేగం కమల్ పాషా, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, సీనియర్ నాయకులు బొంతు వేణు సుమలత, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు, సీనియర్ నాయకుడు చల్లగుళ్ల నరసింహారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, కౌన్సిలర్లు విరివాడ అపర్ణ భూషణం, షరీఫ్, కర్నాటి విజయకుమారి, దేవ జ్యోతి, తోట సుజాలరాణి, దేవి స్వీట్స్ శ్రీను, జగన్నాథం శ్రీను, శరత్, మట్టా ప్రసాద్, హకీమ్, పర్స రాము, కోఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



# గణనాథునికి చందా బహుకరణ చేసిన వాకిటి

**వలిగొండ సెప్టెంబర్ 27 మహా న్యూస్ :** వలిగొండ మండల పరిధిలోని అరూరు గ్రామానికి చెందిన శ్రీకృష్ణ యూత్ అసోసియేషన్ నెలకొల్పిన గణనాథునికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు వాకిటి అనంతరెడ్డి ఆదివారము 5000 రూపాయల చందాను అందజేశారు. అదేవిధంగా ఆవుల స్వామి 2000 రూపాయల చందాను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు ఎర్ర సాయి, బుర్ర శ్రీకర్, బత్తిని కర్ణ గౌడ్, గుడిగ మోహన్, వల్లపు ప్రవీణ్, పాక మహేష్, మర్రి నరేష్, వల్లపు శివ ,నూకల ఉదేశ్, జినుకల మహేష్, ముత్యాల గణేష్, మహేష్, సతీష్, శివ, మణిదీప్, మణికాంత్ తదితరులు పాల్గొన్నారు.



# కొండా లక్ష్మణ్ బాపూజీ త్యాగాలు చిరస్మరణీయం:కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యమకారుడిగా స్వాతంత్ర్య సమరయోధుడిగా ప్రజా జీవితంలో విశిష్ట సేవలు అందించారని ఆయన త్యాగాలు పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. ఆదివారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడిగా తెలంగాణ స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ కీలక పాత్ర పోషించారని తెలిపారు. 1969లో జరిగిన తొలి దశ తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొని రాష్ట్ర సాధన కోసం దీక్ష చేపట్టడంతో పాటు తన మంత్రి పదవిని సైతం తృణప్రాయంగా వదులుకుని ఉద్యమానికి అండగా నిలిచారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనతో పాటు బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి ఆయన జీవితాంతం కృషి చేశారని తెలిపారు. సమాజంలోని పేదలు బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి తన ఆస్తులను సైతం దానం చేసిన త్యాగశీలి కొండా లక్ష్మణ్ బాపూజీ అని కలెక్టర్ పేర్కొన్నారు. ఆయన ఆశయాలు సేవలను స్మరించుకుంటూ జయంతి వేడుకలు నిర్వహించడం సంతోషకరమన్నారు. ఆయన చూపిన సేవా త్యాగ మార్గాన్ని స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పి.విజయలక్ష్మి, బీసీ సంఘ నాయకులు చిప్పా శ్రీనివాస్, ఉదయ్ కుమార్, మోత్కూరి ధర్మారావు, బి.సత్యనారాయణ, గమలాపురం సత్యనారాయణ, కొదుమూరు సత్యనారాయణ కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల అక్రమాలపై అధికారుల నిఘా ఏది?

- దుకాణాల్లో నిబంధనలకు తూట్లు..
- కొందరి అధికారులతో లావాదేవీలపై ఆరోపణలు?
- రైతుల ప్రయోజనాల కంటే వ్యాపారుల ప్రయోజనాలకే పెద్దపీట?

**పెద్దపల్లి మహా :** జిల్లాలో ఎరువుల విక్రయాల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఎరువుల దుకాణాల్లో నిబంధనలకు విరుద్ధంగా లావాదేవీలు జరుగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నప్పటికీ సంబంధిత అధికారులు మాత్రం కఠిన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా, కొందరు ఎరువుల వ్యాపారులకు వ్యవసాయ శాఖ కొందరు అధికారులతో ఆర్థిక లావాదేవీలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు సైతం స్థానికంగా వినిపిస్తున్నాయి.?

రైతులకు సబ్సిడీపై అందాల్సిన ఎరువులు పక్కదారి పడుతున్నాయా? నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారా? స్టాక్ రిజిస్టర్లలో ఒకలా.. వాస్తవ నిల్వల్లో మరోలా చూపిస్తున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు వ్యాపారులు నిబంధనలను పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నప్పటికీ, తనిఖీలు మాత్రం కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయనే విమర్శలు ఉన్నాయి.

**తనిఖీల పేరుతో తూతూమంత్రం**

ఎరువుల దుకాణాల్లో స్టాక్, విక్రయ రికార్డులు, ధరల పట్టిక, రైతులకు ఇచ్చే బిల్లులు తదితర అంశాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉంటుంది. కానీ కొన్ని ప్రాంతాల్లో తనిఖీల తీరుపై రైతుల్లోనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముందస్తు సమాచారం ఇచ్చి తనిఖీలు చేస్తున్నారా లోపాలు బయటపడినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

ముఖ్యంగా వ్యవసాయ శాఖ అధికారులకు, కొందరు వ్యాపారులకు మధ్య లావాదేవీలు జరుగుతున్నాయనే ఆరోపణలు నిజమైతే, వాటిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది.

**అక్రమాలపై సమగ్ర విచారణకు డిమాండ్**

జిల్లాలోని ఎరువుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వాస్తవ నిల్వలు, రికార్డులు, కొనుగోలు-అమ్మకాల వివరాలను సరిపోల్చాలని రైతులు కోరుతున్నారు. అక్రమ నిల్వలు, అధిక ధరల విక్రయాలు, నకిలీ లేదా నాసిరకం ఎరువుల విక్రయాలు బయటపడితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**ఓ మండలంలో ఎరువుల అక్రమ విక్రయాలపై ఆరోపణలు?**

మండలంలో కొంతమంది ఎరువుల వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా అధిక మోతాదులో యూరియా, ఇతర ఎరువులను విక్రయిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో కిష్టంపేట పరిసర ప్రాంతం నుంచి యూరియాను వరంగల్ జిల్లా వైపు అక్రమంగా తరలించినట్లు ఆరోపణలు వచ్చినా చర్యలు తీసుకోలేదనే విమర్శలు ఉన్నాయి. దీనిపై జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు వివరాలు సేకరించి తరుణంలో , విచారణను నీరుగార్చే ప్రయత్నాలు జరిగాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.?రాజకీయ అండదండలతో పాటు యూరియా తరలింపు,ఎరువుల విక్రయాలపైనా ఆరోపణలు ఉండటంతో సమగ్ర విచారణ జరిపి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు. ఎరువుల సంబంధించిన ఓ వ్యాపారి అధిక ధరలకు అమ్మకాలు చెప్పటి .. అక్రమ మార్గాల్లో ఆస్తులు కూడబెట్టుకున్నారనే ప్రచారం స్థానికంగా జరుగుతున్నప్పటికీ, ఈ ఆరోపణలకు సంబంధించి అధికారాలు ఎంక్వైరీ చేస్తే అన్ని బయట పడుతాయి అని తెలుస్తుంది . మరి అధికారులు ఆ దిశగా అడుగులు వేస్తారా వేచి చూడాలి. అందుకే వ్యాపారి ఇలా జరుగుతుందని ఉద్దేశంతో జాగ్రత్త పడుతున్నట్లు విశ్వసినీయ సమాచారం. తనకు ఉన్న ఆర్థిక, రాజకీయ పలుకుబడిని ఉపయోగించుకుని నిబంధనలను ఉల్లంఘిస్తున్నారనే ఆరోపణలు కూడా స్థానికంగా చర్చకు వస్తున్నాయి. ఇతడు అక్రమంగా చేయని దందాలు అంటూ ఏమి లేదు అని జోరుగా చర్చ ఆ మండల పరిధిలో జరుగుతుంది.రాజకీయ నాయకులకు అక్రమ సంపదతో పెట్టుబడులు పెడుతున్నారనే ప్రచారం సైతం జరుగుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. అయితే ఈ అంశాలపై సంబంధిత అధికారులు విచారణ నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కొన్ని రోజులు క్రితం ఓదెల మండల సర్వసభ్య సమావేశంలో యూరియా కొరత, పంపిణీలో జాప్యంపై సభ్యులు ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియాను అదనపు ధరలకు విక్రయిస్తూ రైతుల నుంచి అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు రావడంతో, అక్రమాలకు అడ్డుకట్ట వేసి రైతులకు సకాలంలో యూరియా అందించాలని డిమాండ్ చేశారు.

రైతుల కోసం ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఎరువులు పక్కదారి పడుతున్నాయా? అధికారుల పర్యవేక్షణ లోనే అక్రమాలు సాగుతున్నాయా? ఆరోపణల్లో వాస్తవమెంత? అనే అంశాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించి పూర్తి స్థాయి విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది.



# కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయం

**పెద్దపల్లి మహా :** రామగుండం పోలీస్ కమిషనరేట్ లో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ.. కొండా లక్ష్మణ్ బాపూజీ దేశానికి, తెలంగాణ ప్రాంతానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం దశాబ్దాల పాటు అలుపెరుగని పోరాటం చేసిన మహనీయుడిగా బాపూజీ చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువల కోసం ఆయన చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని సీపీ అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ కమిషనరేట్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొని బాపూజీకి నివాళులర్పించారు.

# రైతాంగ సమస్యలపై సమరశంఖం

- కిసాన్ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి: శీలం సత్యనారాయణరెడ్డి

**సత్తుపల్లి, మహా** : రైతాంగ సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్ పోరాటాలకు కార్యాచరణ రూపొందించనున్న అఖిల భారత కిసాన్‌సభ 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. నవంబరు 15 నుంచి 18 వరకు నల్గొండ పట్టణంలో నిర్వహించనున్న ఈ మహాసభల్లో భాగంగా 15న జరిగే బహిరంగ సభకు రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. సత్తుపల్లిలోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం ఎలగం కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన సీపీఎం సత్తుపల్లి మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న గిట్టుబాటు ధరలు, రుణభారం, సాగునీరు, ఎరువులు-విత్తనాల కొరత, రైతు భూముల రక్షణ తదితర సమస్యలపై జాతీయ మహాసభల్లో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వాలు విధానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సీతారామ ప్రాజెక్టు పూర్తిపై ఉద్యమం

జిల్లాలో సీతారామ ప్రాజెక్టును పూర్తిచేసి రైతులకు సాగునీరు అందించాలని తెలంగాణ రైతు సంఘం అనేక సంవత్సరాలుగా ఉద్యమిస్తోందని సత్యనారాయణరెడ్డి తెలిపారు. సాగునీటి సమస్యలు, సాగర్ జలాల విడుదల, కాలువల మరమ్మతుల కోసం రైతులను సమీకరించి పోరాటాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోళ్లలో సమస్యలు పరిష్కరించడం, రైతులకు రావాల్సిన బకాయిలను విడుదల చేయించడం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నామని చెప్పారు. పామాయిల్, చెరకు రైతులకు కనీస మద్దతు ధర కల్పించడంతో పాటు బ్యాంకు రుణాలు, రుణమాఫీ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న కిసాన్‌సభ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్, మండల కార్యదర్శి జాజిరి జ్యోతి, వేపులపాటి కుమారస్వామి, అయినంపూడి సునందరావు, కువ్వారపు లక్ష్మణరావు, ఎలగం రాములు, తడికమళ్ల రామకృష్ణ, బండి వేలాద్రి, కావూరి వెంకటేశ్వరరావు, ముత్తిని శ్రీను, కొలికిపోగు రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



# 1994-95 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం!

**పెద్దపల్లి మహా :** కాల్వ శ్రీరాంపూర్: మండలంలోని ప్రాథమిక పాఠశాలలో 199495 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఎన్నో ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకున్న పూర్వ విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపారు.ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ విద్యాభ్యాస సమయంలో జరిగిన సంఘటనలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు అందించిన విద్య, మార్గదర్శకత్వం తమ జీవితాల్లో ఎంతో ప్రభావం చూపిందని గుర్తుచేసుకున్నారు. చదువుకున్న పాఠశాల, ఉపాధ్యాయులు, స్నేహితులతో తమకున్న అనుబంధాన్ని స్మరించుకున్నారు. పూర్వ విద్యార్థులంతా పరస్పరం ఆత్మీయంగా పలకరించుకుని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి స్నేహితులను సంవత్సరాల తర్వాత కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని పలువురు పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహించుకోవాలని నిర్ణయించారు. ట్రస్ట్ ఏర్పాటు చేసుకుని ఆపదలో ఉన్న వారికి తమ మిత్రులకు సహాయ సహకారాలు అందించాలని ఒక గొప్ప నిర్ణయానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో 199495 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అందరూ కలిసి ఫొటోలు దిగుతూ తమ మధుర జ్ఞాపకాలను పదిలపరుచుకున్నారు.



# అక్షరాస్యత పరీక్ష రాసిన సర్పంచ్

**పెద్దపల్లి మహా :** ధర్మారం:సంపూర్ణ అక్షరాస్యత లక్ష్యంగా “అమ్మకు అక్షరమాల” పేరుతో చేపట్టిన అక్షరాస్యత పరీక్షకు అపూర్వ స్పందన లభించింది. ధర్మారం మండల కేంద్రంలోని గ్రామ సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పరీక్షకు మహిళలతో పాటు ధర్మారం సర్పంచ్ ద్యాగేటి రాజేశ్వరి హాజరై పరీక్ష రాశారు. చిన్నతనంలో చదువుకోలేకపోయిన వారికి ఈ కార్యక్రమం ద్వారా అక్షరాలు నేర్చుకునే అవకాశం లభించిందని సర్పంచ్ రాజేశ్వరి పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా చదువుపై ఆసక్తి పెరిగిందని పలువురు మహిళలు సంతృప్తి వ్యక్తం చేశారు.

# 30న బెల్లంపల్లిలో కిసాన్ మేళ

**మంచిర్యాల, మహా** : రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతికత, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 30న బెల్లంపల్లిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో కిసాన్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదివారం ఒక ప్రకటనలలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ మేళాలో పంటల సాగులో నూతన పద్ధతులు, వ్యవసాయ పథకాలు, రైతు సంక్షేమ కార్యక్రమాలపై వ్యవసాయ నిపుణులు, అధికారులు రైతులకు సూచనలు, సలహాలు అందిస్తారని పేర్కొన్నారు. కళారూపాల ద్వారా పథకాలను వివరిస్తారన్నారు. మంచిర్యాల జిల్లాలోని రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని కిసాన్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.



# మహిళల ఆత్మగౌరవమే ‘ఇందిరా మహిళా శక్తి’ లక్ష్యం

- దసరా పండుగ కానుకగా చీరల పంపిణీ.. మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే రాగమయి

**సత్తుపల్లి, మహా** : దసరా పండుగను పురస్కరించుకుని మహిళలకు ‘ఇందిరా మహిళా శక్తి’ చీరలను అందించడం ద్వారా వారి పట్ల గౌరవాన్ని చాటుతున్నామని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా మరింత ఎదగడానికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. సత్తుపల్లి మున్సిపాలిటీ ఏడో వార్డు రాజీవ్ కాలనీలో ఆదివారం మున్సిపల్ కౌన్సిలర్ షరీఫ్ నసీమ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళలకు దసరా కానుకగా ‘ఇందిరా మహిళా శక్తి’ చీరలను ఎమ్మెల్యే రాగమయి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళల శక్తి, ఆత్మగౌరవం, స్వావలంబనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. పండుగ సమయంలో మహిళలకు చీరలు అందించడం కేవలం కానుకగా కాకుండా మహిళల పట్ల గౌరవానికి ప్రతీకగా భావిస్తున్నామని చెప్పారు. మహిళలు కుటుంబంతో పాటు సమాజ అభివృద్ధిలోనూ కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. మహిళలకు అవకాశాలు కల్పిస్తే కుటుంబాలతోపాటు.. సమాజం అభివృద్ధి చెందుతుందని రాగమయి పేర్కొన్నారు. మహిళా సంఘాలను బలోపేతం చేసి వారికి ఉపాధి, ఆర్థిక స్వావలంబనకు మరిన్ని అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలు తమ ప్రతిభను నిరూపించుకునేలా ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రెహానా బేగం కమల్ పాషా, సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, స్థానిక నాయకులు, మహిళలు, కార్యకర్తలు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.



# రెడ్ల ఐక్యత సంక్షేమం కోసం కృషి

- తెలంగాణ రెడ్డి సంఘం అధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి
- విజయవంతమైన రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా మహాసభ

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** అన్ని కులాలతో కలిసి ఉంటూనే రెడ్ల ఐక్యత పేదల సంక్షేమం కోసం కృషి చేయడంతో పాటుగా రాష్ట్రంలో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి 1000 కోట్ల కార్పస్ పండు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రెడ్డి సంఘాలను ఐక్యం చేయడం జరిగిందని తెలంగాణ రెడ్డి సంఘం అధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి స్పష్టం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా మహాసభ పాల్వంచ పెద్దమ్మ తల్లి గుడి వద్ద అంబిక ఫంక్షన్ హాల్ లో ఆదివారం పాల్వంచ మండల రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు పాతూరు చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ రెడ్డి సంఘం అధ్యక్షులు బద్దుల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న అన్ని రెడ్డి సంఘాలను ఐక్యం చేసి ఒకే గూటికి తీసుకురావడం జరిగిందని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో నిరంతరం చర్చలు జరుపుతూ రాష్ట్రంలో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు నిరుపేద రెడ్ల సంక్షేమం కోసం వెయ్యి కోట్ల కార్పస్ పండ్ ఏర్పాటు చేయాలని నిరుపేద రెడ్ల కుటుంబాల్లో ఉన్న విద్యార్థులకు నిరుద్యోగులకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేయాలని నిరుపేద రెడ్ల కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు ఇంటి స్థలాలు పెన్షన్లు ఇతర సంక్షేమ పథకాలు అందించాలని కోరుతూ తదితర సమస్యలపై తీర్మానాలు చేసి ప్రతిపాదించడం జరుగుతుందని చెప్పారు. ఈ మహాసభలో భద్రాద్రి కొత్తగూడెం రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులుగా జమ్మల సీతారామ రెడ్డి, జిల్లా జనరల్ సెక్రెటరీగా యరమల శ్రీనివాసరెడ్డి, కోశాధికారిగా కల్లెం వెంకటరెడ్డితో పాటుగా మరో 59 మందిని ఆఫీస్ బేరర్స్ ను కార్యవర్గ సభ్యులుగా జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలను కలుపుతూ నాయకత్వ బాధ్యతలు ఇవ్వటం జరిగింది. ఈ మహా సభలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉన్న ఐదు నియోజకవర్గాలు 22 మండలాలు నాలుగు పట్టణాల నుండి 300 మందికి పైగా ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.



# రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- ఆరుతడి పంటలపై రైతులు దృష్టి సారించాలి
- ఎల్‌నినో ప్రభావంతో వర్షా లపై ప్రభావం ఉండొచ్చు: ప్రభుత్వ విప్ విజయరమణారావు

**పెద్దపల్లి మహా,** ఎలిగేడు:రైతుల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం పరిస్థితుల్లో మార్పులు ఉండే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఆరుతడి పంటలపై దృష్టి సారించాలని సూచించారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో పంటల ప్రణాళిక, నీటి యాజమాన్యంపై రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు కూడా సూచిస్తున్నారు.ఎలిగేడు మండల కేంద్రంలోని మధుర ఫంక్షన్‌హాల్‌లో ఎలిగేడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు సమా రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన 137వ సర్వసభ్య సమావేశానికి విజయరమణారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులను అభినందించారు. ముందుగా టీవీ9, సిటీ కేబుల్ పాత్రికేయుడు టీకే రమేష్ మృతికి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా విజయరమణారావు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధరణి పేరుతో భూదోపిడీ జరిగిందని ఆరోపించారు. కేసీఆర్ కుటుంబానికి వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ధరణి కారణంగా పేదల భూములు గల్లంతయ్యాయని, 22ఏ భూముల విషయంలో బీఆర్ఎస్ నాయకులు గతంలో చేసిన విమర్శలపై ఇప్పుడు వారి ఆస్తుల విషయాలు వెలుగులోకి వస్తున్నా ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. సీఆర్ కుటుంబానికి బినామీ పేర్లతో ఇంకా ఎన్ని ఆస్తులు ఉన్నాయో తెలియని పరిస్థితి ఉందని ఆరోపించారు. 22ఏ పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల 76 వేల ఎకరాలు మాత్రమే ఉన్నాయని, కోటి ఎకరాలంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.కాళేశ్వరం నీరు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చుక్క కూడా రాలేదని విజయరమణారావు పేర్కొన్నారు. కాళేశ్వరం నీరు వచ్చినట్లు నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తానని సవాల్ చేశారు.

**రైతులను ఆదుకుంటాం**

సూపర్ ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షాలపై ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున రైతులు పంటల విషయంలో ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. ఖరీఫ్‌లో అవసరాల మేరకు రెండు తడులకు ఎస్సారెస్పీ నీటిని అందించి పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని కోరారు. అనంతరం ఎలిగేడు మండల కేంద్రంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్, సింగిల్ విండో చైర్మన్లు, డైరెక్టర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## రాజకీయ లబ్ధి ఆశించకుండా
# ప్రజా సేవలో నిమగ్నమైన మహా నాయకుడు కేసీఆర్..

- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ఘన్సిమీయా గూడ భూముల కోసం రేవంత్ రెడ్డి పంచన చేరాడు.
- రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టైం అయిపోయింది.
- వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు

**రాజేంద్రనగర్, మహా:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. గ్రేటర్ శంషాబాద్‌లోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మణికొండకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు సీతారాం ఆధ్వర్యంలో పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కేటీఆర్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.కేటీఆర్ మాట్లాడుతూ.. రాజేంద్ర నగర్ ఎమ్మెల్యేను నియోజకవర్గ ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు కేసీఆర్‌ను చూసి గెలిపించారని అన్నారు. అయితే ఘన్సిమీయాగూడ, సుల్తాన్‌పల్లి భూముల వ్యవహారంలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పంచన చేరారని ఆరోపించారు. రాజేంద్ర నగర్ ఎమ్మెల్యేకు సమయం అయిపోయిందని వ్యాఖ్యానించారు.గణేష్ నిమజ్జనం సందర్భంగా పోలీసులు డీజేలు, పాటలపై ఆంక్షలు విధించడం విచిత్రంగా ఉందని కేటీఆర్ అన్నారు. పోలీసుల ప్రధాన బాధ్యత శాంతిభద్రతలను కాపాడటమేనని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల స్వభావాన్ని అర్థం చేసుకోకుండా ఆంక్షలు విధిస్తే యువతలో మరింత స్పందన వస్తుందని అన్నారు.'ది ప్యారడైజ్' సినిమాలో కేసీఆర్ పాత్ర ద్వారా తెలంగాణ ప్రజల్లో ఆయనపై ఉన్న అభిమానం మరోసారి కనిపించిందని కేటీఆర్ పేర్కొన్నారు. అధికారం కోల్పోయినా కేసీఆర్‌పై ప్రజల్లో మమకారం తగ్గలేదన్నారు. కరెంట్, తాగునీరు, వ్యవసాయ సమస్యలు ఎదురైనప్పుడు ప్రజలు కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటున్నారని చెప్పారు.బీఆర్ఎస్ హయాంలో రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేశామని, కోత్వాల్‌గూడ ఎకో పార్కును అభివృద్ధి చేశామని తెలిపారు. కేసీఆర్ అధికారంలో కొనసాగి ఉంటే రాయదుర్గం నుంచి శంషాబాద్ వరకు మెట్రో పనులు పూర్తయ్యేవని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం జీఓ 58, 59 కింద సుమారు రెండున్నర లక్షల మందికి పట్టాలు ఇచ్చిందని, హైదరాబాద్‌లో లక్ష డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించిందని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్లు కావస్తున్నా ఒక్క ఇటుక కూడా పెట్టలేదని కేటీఆర్ విమర్శించారు. మూసీ ప్రక్షాళన, హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో రాజ్యాంగబద్ధ పాలనకు బదులుగా రేవంత్‌రెడ్డి పాలన కొనసాగుతోందని వ్యాఖ్యానించారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## 94వ రోజుకు చేరిన 60 గజాల
# బాధితుల రిలే నిరాహార దీక్ష

**మొయినాబాద్ మహా**: మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ భూముల విషయంలో అధికారులు పేదల పట్ల ఒక విధంగా, బడాబాబుల భూముల విషయంలో మరో విధంగా వ్యవహరిస్తున్నారని హిమాయత్‌నగర్ 60 గజాల పట్టా హక్కుదారులు ఆరోపించారు. మున్సిపాలిటీ చుట్టుపక్కల ప్రభుత్వ భూములు ఉన్నప్పటికీ వాటి జోలికి అధికారులు వెళ్లడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులను ప్రశ్నిస్తే అవి బడాబాబుల భూములని చెబుతున్నారని నిరసనకారులు పేర్కొన్నారు. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్‌నగర్ సర్వే నంబర్ 151లో నాలుగు యువజన సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారంతో 94వ రోజుకు చేరింది. తమకు మంజూరైన ఇంటి స్థలాల పొజిషన్‌ను వెంటనే అప్పగించాలని కోరుతూ ప్రజలు శాంతియుతంగా నిరసన తెలుపుతున్నారు. 2007లో 290 మందికి ఇంటి పట్టాలు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు ఒక్కొక్కరికి 60 గజాల చొప్పున 290 మందికి ఇంటి స్థలాల పట్టాలు మంజూరు చేసిందని హక్కుదారులు తెలిపారు. పట్టాలు మంజూరైన అనంతరం లబ్ధిదారులు తమకు కేటాయించిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణం కోసం పునాదులు కూడా తీసుకున్నారని పేర్కొన్నారు. అయితే సర్వే నంబర్ 151లో పట్టాలు ఇచ్చిన స్థలాల నుంచి రహదారి కోసం వెనుక భూమికి సంబంధించిన వ్యక్తి కోర్టులో కేసు దాఖలు చేయడంతో సమస్య ఏర్పడిందని వారు తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటివరకు తమకు కేటాయించిన ఇంటి స్థలాల పొజిషన్ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు.స్థలాలు ఇచ్చే వరకు పోరాటం ఆగదు తమకు కేటాయించిన ఇంటి స్థలాలను తమకు అప్పగించే వరకు పోరాటం కొనసాగుతుందని హక్కుదారులు స్పష్టం చేశారు. ఇది మా హక్కు.. మాకు కేటాయించిన ఇంటి స్థలాలు మాకు ఇవ్వాలి అని డిమాండ్ చేశారు. 94 రోజులుగా శాంతియుతంగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న హిమాయత్‌నగర్ ప్రజలకు ఏదైనా హాని జరిగితే ప్రభుత్వం, సంబంధిత అధికారులే బాధ్యత వహించాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పేదలకు మంజూరైన ఇంటి స్థలాలను వారికి అప్పగించి న్యాయం చేయాలని హిమాయత్‌నగర్ పట్టా హక్కుదారులు కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్. బి.ఆర్. అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కట్టమీద శ్రీను, శాంతి యువజన సంఘం అధ్యక్షుడు కుమ్మరి విటల్, మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ యూత్ మాజీ అధ్యక్షుడు కరీమ్, సేవాలాల్ యూత్ అధ్యక్షుడు గోపాల్ నాయక్, శాబాద్ ప్రవీణ్, రెడ్డిపల్లి సుమన్, శాబాద్ నాగరాజు, జల్లెల మల్లేష్, గుండు నరేష్, గుర్రం చంద్రశేఖర్, కట్టమీది రత్నయ్య, వీరస్వామి, కట్టమీద మల్లేష్, కుమ్మరి శ్రీను, బైండ్ల యాదయ్య , హిమాయత్ నగర్ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలి కుల బాంధవుల ఆత్మీయ సమ్మేళనం

**మందమర్రి, మహా :** మందమర్రి మండలంలోని అమ్మగార్డెన్, మంజునాథ హిల్స్ ప్రాంతాలకు చెందిన పద్మశాలి కుల బాంధవుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పులిమడుగులోని లక్ష్మీ గార్డెన్‌లో ఆనందోత్సాహాల మధ్య జరిగింది. చిందం చంద్రకాంత్, బత్తుల శ్రీనివాస్, అనుమండ్ల సుధాకర్, పల్లెర్ల సమ్మయ్య, తడక రవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 120 కుటుంబాలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, కుల బాంధవుల మధ్య ఆత్మీయత, ఐక్యతను పెంపొందించేందుకే ఈ సమ్మేళనం ఏర్పాటు చేశామన్నారు. ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్ తరాలకు పరస్పర సహకారాన్ని అందిస్తాయని పేర్కొన్నారు.



# నాణ్యమైన ప్రభుత్వ విద్య ప్రతి కుటుంబం హక్కు

- మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి
- ఫీజుల భారాన్ని తగ్గించాలి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి
- గబ్బిలాల పేటలో ప్రభుత్వ స్కూలు నిర్మించాలి



**జవహర్ నగర్, మహా :** జవహర్ నగర్ పరిధిలోని గబ్బిలాల పేటలో తెలంగాణ పీపుల్స్ ఫ్రంట్ ఆధ్వర్యంలో గబ్బిలాల పేట స్కూల్ నిర్మాణం పై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది ఈ సందర్భంగా మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి మాట్లాడుతూ తెలంగాణలో తీవ్ర సంక్షోభంలో ఉన్న విద్యా వ్యవస్థను రక్షించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు..అనియంత్రిత ప్రైవేట్ పాఠశాలల ఫీజులు, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత వల్ల దాదాపు 40 లక్షల కుటుంబాలు ఆర్థిక భారాన్ని మోస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 63% మంది విద్యార్థులు ప్రైవేట్, 37% మంది మాత్రమే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారని మురళి పేర్కొన్నారు . ఉపాధ్యాయుల కొరత, వసతులు లేకపోవడం వల్ల 2,245 పాఠశాలలు మూతపడగా, 5,001 పాఠశాలలు ఒకే ఉపాధ్యాయుడితో నడుస్తున్నాయని యూడిఐ ఎస్ఇ గణాంకాలను ఉటంకించిందని తెలిపారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి ఎస్ బోస్ సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ మాట్లాడుతూ తెలంగాణ పీపుల్స్ ఫ్రంట్ ప్రభుత్వ పాఠశాల సాధన కోసం చేస్తున్న పోరాటంలో భాగంగా సిపిఐ పార్టీ భాగస్వామ్యం అవుతుందని సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కొన్ని డిమాండ్ లను మురళి సమావేశంలో ఉంచారు. ఫీజుల నియంత్రణ చట్టం ఆకునూరి మురళి నేతృత్వంలోని విద్యా కమిషన్ సిఫార్సుల మేరకు ప్రైవేట్ పాఠశాలల ఫీజులను పర్యవేక్షించేందుకు స్వతంత్ర చట్టబద్ధమైన కమిటీని ఏర్పాటు చేయాలి. **ప్రభుత్వ పాఠశాలల బలోపేతం:** 'తెలంగాణ పబ్లిక్ స్కూల్స్' నమూనా ద్వారా ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి. 18% బడ్జెట్ కేటాయింపు: రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో విద్యా రంగానికి కనీసం 18% నిధులు కేటాయించేలా చట్టపరమైన హామీ ఇవ్వాలి.విద్య వ్యాపార వస్తువు కాదని, ప్రతి బిడ్డ హక్కు అని పేర్కొంటూ.. ఈ డిమాండ్ల సాధనకు ప్రజలతో కలసి బలమైన ఉద్యమాన్ని నిర్మిస్తామని టీపీఫ్ పిలుపునిచ్చింది.ఈ కార్యక్రమంలో మాజీ ఐఏఎస్ ఎంవీ రెడ్డి, మాజీ ఐఏఎస్ ఎం చంపాలాల్, సృజన యాదవ్, షేక్షావలి, సిపిఐ, సిపిఎం నాయకులు గబ్బిలాల పేట కాలనీ ప్రజలు విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



# కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి

**నివాళులర్పించిన ఉప్పల్ ఎమ్మెల్యే**

**కుషాయిగూడ, మహా :** తెలంగాణ మలిదశ ఉద్యమ నేత, స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ మంత్రి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకొని ఉప్పల్, చిలకనగర్ డివిజన్లలో ప్రత్యేక నివాళి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు బండారు లక్ష్మారెడ్డి కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ... కొండా లక్ష్మణ్ బాపూజీ బహుజన శ్రేయస్సు కోసం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాంతం కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. వెనుకబడిన వర్గాల హక్కుల కోసం, చేనేత రంగాభివృద్ధికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని గుర్తుచేసుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన చూపిన చొరవ, చేసిన త్యాగాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని తెలిపారు. బాపూజీ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ పునరంకితం కావాలని, ఆయన చూపిన పోరాట బాటలోనే మనమందరం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం, బహుజన సంక్షేమం కోసం ఆయన కన్న కలలను నిజం చేసేందుకు కృషి చేయడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ గుడి మధుసూదన్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని బాపూజీకి నివాళులర్పించారు.



## న్యూ ఈద్గా కమాన్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే

**కుషాయిగూడ, మహా:** కాప్రాలో నూతనంగా నిర్మించిన న్యూ ఈద్గా కమాన్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై నూతన ఈద్గా కమాన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఈద్గా కమాన్ నిర్మాణానికి కృషి చేసిన కమిటీ సభ్యులు, సలహాదారులను అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి, మాజీ హోంమంత్రి మహమూద్ అలీ, కెనడా ప్రవాస భారతీయుడు అఫ్సర్ సయ్యద్, ఈద్గా కమిటీ చైర్మన్ మొహమ్మద్ ఖాజా బద్రుద్దీన్, బీఆర్ఎస్ నాయకులు బైరీ నవీన్ గౌడ్, మొహమ్మద్ ఖాజా మొయినుద్దీన్, మొహమ్మద్ తాహిర్, మొహమ్మద్ తాజుద్దీన్, మొహమ్మద్ మహబూబ్ ఖాన్, మొహమ్మద్ మక్బూల్, రహీమ్, సయ్యద్ సబీర్ అలీ, మొహమ్మద్ రఫీక్, మొహమ్మద్ సలీం, అబ్దుల్ హకీమ్, ఇమ్రాన్, మొయిస్ పాషా, ఎస్.ఎం. జీలానీ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు..

**ఆదిభట్ల సెప్టెంబర్ 27 మహా:** కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకుని ఆదిభట్ల సర్కిల్-15 రాగన్నగూడ కార్యాలయంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ... కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం, ప్రజా సేవలు, తెలంగాణ ఉద్యమంలో ఆయన పోషించిన పాత్ర గురించి వివరించారు. ప్రజల హక్కుల కోసం ఆయన చేసిన కృషిని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. అనంతరం కొండా లక్ష్మణ్ బాపూజీ గారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి శ్రీనివాసులు, కార్యాలయ అధికారులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## దండుమైలారంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన బీఆర్ఆర్ ఫౌండేషన్.!

**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 27 మహా:** పేద ప్రజల ఆరోగ్యంమే తమకు మధ్యమని, వారికి కావలసిన వైద్య సదుపాయాలు అందిస్తానని బురద రామ్ రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం మండలం, దండుమైలారం గ్రామంలో బీఆర్ఆర్ ఫౌండేషన్, సాయి కీర్తన్ రెడ్డి లెగసీ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథి ఫౌండేషన్ చైర్మన్ బూడిద రామ్ రెడ్డి హాజరై మాట్లాడుతూ... ప్రస్తుత పరిస్థితులలో ఆరోగ్యానికి కాపాడుకోవాలంటే నిత్యం తినే ఆహారపు అలవాట్లను మార్చుకోవాలని తెలిపారు. ఆహారపు అలవాట్లు మార్చుకున్నప్పుడు ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా పయనీర్ ఆసుపత్రి సిబ్బంది ఆధ్వర్యంలో 360 మందికి సాధారణ చికిత్సలు, సాదూరం డా. ఎమ్మెస్ రెడ్డి, డాక్టర్ వినయ్ రెడ్డి నేతృత్వంలో 650 మందికి కంటి చికిత్స నిర్వహించడం జరిగింది... ఈ సందర్భంగా కంటి ఆపరేషన్కు అయ్యే ఖర్చులు, ట్రాన్స్ పోర్ట్ తో సహా తనే భరిస్తానని బిఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ రామ్ రెడ్డి తెలిపారు. తండ్రి బాటలో తనయురాలుగా బూడిద అక్షయ రెడ్డి కూడా సేవా భావం దృక్పథంతో ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు మంచి ఆరోగ్యం అలాగే రోడ్డు సేఫ్టీ అనే కార్యక్రమంతో మీకు అందుబాటులో ఉంటానని తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బిఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యులు మంగఐలేష్ మాట్లాడుతూ... తన సొంత ఖర్చులతో మా గ్రామంలో ఇంత పెద్ద ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి, మన గ్రామంలో ఎంతో మంది పేద ప్రజల ఆరోగ్యం కోసం తపిస్తున్న, బిఆర్ఆర్ ఫౌండేషన్ రామ్ రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు మా గ్రామం తరపున తెలియజేయడం జరుగుతుందన్నారు.. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గ్రామ పెద్దలు, గ్రామ ప్రజానీకం పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





## కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలు ఆదర్శనీయం

- పద్మశాలి టౌన్ షిప్ కోపరేటివ్ చైర్మన్ సీతా ఆంజనేయులు.

**కుషాయిగూడ, మహా :** తెలంగాణ సాయుధ పోరాటం నుంచి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం వరకు ప్రజల కోసం పోరాడిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలు ఆదర్శనీయమని పద్మశాలి టౌన్షిప్ కోపరేటివ్ చైర్మన్ సీతా ఆంజనేయులు అన్నారు. బాపూజీ కొండ లక్ష్మణ్ జయంతి సందర్భంగా ఏఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని పద్మశాలి టౌన్షిప్ లోఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బాపూజీ తన జీవితాన్ని అంకితం చేశారని తెలిపారు. ప్రజా ఉద్యమాల కోసం పదవులను సైతం త్యజించి, బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడారని గుర్తుచేశారు. సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. బాపూజీ ఆశయాలను నేటి తరం ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు, సొసైటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## తార్నాకలో వంజరి సంఘం ఆధ్వర్యంలో వైద్య శిబిరం

**కుషాయిగూడ, మహా :** తార్నాక వంజరి సంఘ భవనంలో వంజరి బంధు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ రాష్ట్ర వంజరి సంఘం అధ్యక్షుడు కాలేరు నరేష్ హాజరై వైద్యశిబిర నిర్వాహకులను సన్మానించారు. ఈ సందర్భంగా కాలేరు విశ్వనాథం, మాజీ ప్రధాన కార్యదర్శి కె. వెంకటేశం, సభ్యులు రాజ్‌కుమార్, నర్సింగ్‌రావు, అజయ్, శ్రీనివాస్, సంఘం మాజీ సభ్యులు రామోజీ, వంజరి ప్రవీణ్‌కుమార్ కరిపే తదితరులు పాల్గొన్నారు. శిబిరంలో పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.




# జ్ఞాపకాల బడిలో పూర్వ విద్యార్థుల సందడి

- 29 ఏళ్ల తర్వాత మళ్లీ ఒక్కచోట చేరిన 1996–97 బ్యాచ్
- గురువులను ఘనంగా సత్కరించిని పూర్వ విద్యార్థులు

**రాజేంద్రనగర్ మహా ;** 29 ఏళ్ల క్రితం ఒకే తరగతి గదిలో చదువుకున్న స్నేహితులు,ఇన్నేళ్ల తర్వాత ఒక్కచోట చేరారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ సందడి చేశారు. రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1996-97 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం బుద్వేల్‌లోని ఎస్‌ఎన్‌ఆర్ బ్యాంకెట్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయురాళ్లు ఉమాదేవి,సునీతలను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం ఉపాధ్యాయులకు పాదాభివందనం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ తమ వద్ద చదువుకున్న విద్యార్థులంతా 29 ఏళ్ల తర్వాత కూడా అదే ఆత్మీయతతో ఒక్కచోట చేరడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.విద్యార్థులు ఎక్కడ ఉన్నా తమను గుర్తు పెట్టుకుని ఇంత ప్రేమతో ఈరోజు సత్కరించడం జీవితంలో మరిచిపోలేని అనుభూతిని కలిగించిందన్నారు. ఆ రోజులో తరగతి గదిలో అల్లరి చేస్తూ కనిపించిన విద్యార్థులు, నేడు బాధ్యతాయుతమైన వ్యక్తులుగా ఎదిగి తమ ముందుకు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తమ విద్యార్థుల సమాజంలో గౌరవప్రదమైన హోదాలో ఉండడం ఉపాధ్యాయులకు నిజమైన గౌరవమని తెలిపారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ..పాఠశాల రోజుల్లో తమకు విద్యతో పాటు క్రమశిక్షణ,విలువలు నేర్పిన గురువులను జీవితాంతం మరచిపోలేమన్నారు. ఎన్నేళ్లు గడిచినా బాల్య స్నేహితులు ,గురువులతో ఉన్న అనుబంధం చెక్కుచెదరలేదని పేర్కొన్నారు.ఈ ఆత్మీయ సమ్మేళనం తమకు మళ్లీ బాల్యాన్ని గుర్తుచేసిందని ఆనందం వ్యక్తం చేశారు.

## నేడే డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక

**మంచిర్యాల, మహా :** డబుల్ బెడ్రూం ఇళ్ల పథకంలో భాగంగా సెప్టెంబర్ 28న లక్కీ డ్రా పద్ధతిలో పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని మంచిర్యాల మండల తహసీల్దార్ రఫతుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 10:30 గంటలకు జిల్లా కేంద్రంలోని మైనారిటీ ఫంక్షన్ హాల్‌లో లక్కీ డ్రా నిర్వహించి బ్లాక్, ఫ్లోర్ కేటాయిస్తామని పేర్కొన్నారు. లబ్ధిదారులు మాత్రమే హాల్‌లోకి అనుమతించబడతారని, తప్పనిసరిగా ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు. కేటాయింపు తర్వాత అనర్హులపై ఫిర్యాదులు వస్తే విచారణ జరిపి ఇళ్లు రద్దు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# బాధలో బాసటగా.. కంది శ్రీనివాస రెడ్డి పరామర్శలు

**పలువురుకి ఆర్థిక సాయాలు**

**ఆదిలాబాద్ మహా** : ఆప్తులను కోల్పోయి పుట్టెడు దుఖంలో ఉన్నవారి కుటుంబాలకు ,అనారోగ్యంతో బాధపడుతున్న వారి చెంతకు వెళ్లి వారికి కొండంత ధైర్యాన్ని ఇస్తారు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి. ఆదివారం ఆయన ఆదిలాబాద్ రూరల్ , సాత్నాల మండలంలో పర్యటించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన లింగూగూడ గ్రామానికి చెందిన రాధ, పిప్పల్ దరి గ్రామానికి చెందిన ఇగరపు ఇస్తారి బాయి , చెర్ల చిన గంగన్న, సాత్నాల మండలం న్యూ రాంపూర్ గ్రామానికి చెందిన నలగంటి మోహన్ ,జాముగూడ, లోహర, ఎస్సి గూడ, సాలె గూడ గ్రామాలలోని పలువురి నివాసాలని సందర్శించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.అలాగే సాత్నాల మండలం జామిని గ్రామానికి చెందిన మేస్త్రం షైక్ ఫరీద్ అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆయనను పరామర్శించి ఆర్థిక సాయమందించారు.ఆయన వెంట ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు,డీసీసీ ఉపాధ్యక్షులు సుధాకర్ గౌడ్, నాయకులు బోనగిరి సంటన్న,మినుకు నారాయణ్ రెడ్డి, చిల్కూరి సతీష్, దర్శనాల అశోక్, సాహెబ్ రావు, ఎం. ఏ షకీల్, మహమ్మద్ రఫీక్,అరికిల్ల అరవింద్, మహమూద్ ఆదిలాబాద్ రూరల్ , సాత్నాల మండల నాయకులు కార్యకర్తలున్నారు.





# కొండా లక్ష్మణ్ బాపూజీకి కంది శ్రీనివాస రెడ్డి నివాళి

- ఆదిలాబాద్ ఎయిర్ పోర్టుకు ఆయన పేరు పెట్టాలని సూచన
- బాపూజీ సేవలను కొనియాడిన నేత

**ఆదిలాబాద్ మహా** : ప్రత్యేక తెలంగాణ ఉద్యమాలలో తనదైన శైలిలో కొండా లక్ష్మణ్ బాపూజీ కీలక పాత్ర పోషించారని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి గుర్తు చేశారు. ఆదివారం పట్టణంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద జరిగిన జయంతి వేడుకలకు ఆయన పార్టీ శ్రేణులు పద్మశాలి సంఘ ప్రతినిధులతో కలిసి విగ్రమానికి పూలమాల వేసి ఘన నివాళ్లు అర్పించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యమనేతగా, ఎమ్మెల్యేగా ,మంత్రిగా చేసిన సేవలను కొనియాడారు. ఆయన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన వాడు కావడం మన గర్వించదగ్గ విషయమన్నారు. బడుగు బలహీన వర్గాల ఉన్నతి కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన కృషి మరువలేనిదని తెలిపారు.ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ కు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలని ఆయన కోరారు. ఈ విషయాన్ని సీయం రేవంత్ రెడ్డి దృష్టి కి తీసుకువెళతానన్నారు. ఆయన ఆశయాలకనుగుణంగా నడుచుకోవాలని భవిష్యత్ తరాలకు అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు ,డీసీసీ ఉపాధ్యక్షులు సుధాకర్ గౌడ్, నాయకులు బోనగిరి సంటన్న,మినుకు నారాయణ్ రెడ్డి, చిల్కూరి సతీష్, దర్శనాల అశోక్, సాహెబ్ రావు, ఎం. ఏ షకీల్ మహమ్మద్ రఫీక్,అరికిల్ల అరవింద్, మహమూద్ , పద్మశాలి సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్ ప్రక్రియ పై కాంగ్రెస్ పార్టీ ధర్నా

**శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కంది శ్రీనివాస రెడ్డి పిలుపు**

**ఆదిలాబాద్ మహా** : కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ ప్రక్రియలో అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్టు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు, ఉదయం 10గంటలకు నిర్వహించే నిరసన ధర్నా కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



# ఎస్టీయూటీఎస్‌ఏకు అభినందనలు తెలిపిన మల్‌రెడ్డి రంగారెడ్డి

- 80ఏళ్ల ప్రస్థానంలో ఎన్నో విజయాలున్నాయన్న ఎమ్మెల్యే
- టీచర్ల సమస్యల పరిష్కారానికి సర్కార్ కట్టుబడి ఉందని వెల్లడి

**నాగోల్ సెప్టెంబర్ 27 మహా:** 80ఏళ్ల ఎస్టీయూటీఎస్ఏ ప్రస్థానంలో సాధించిన విజయాలు ఎప్పటికీ నిలిచిపోతాయని అదే స్ఫూర్తితో ముందుకెళ్లాలని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు.హైదరాబాద్ నాగోల్‌లోని శుభం కన్వెన్షన్‌లో తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (STUTSA) ఆధ్వర్యంలో నిర్వహించిన 80వ వసంత వేడుకల్లో మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్టీయూటీఎస్ఏ ఉపాధ్యాయులకు మల్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. పిల్లల భవితకు బంగారుబాటలు వేయటంలో ఉపాధ్యాయుల కృషి కీలకమన్న ఎమ్మెల్యే ... ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వపాఠశాలలను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు చెప్పారు. టీచర్ల సమస్యల పరిష్కారానికి రేవంత్‌రెడ్డి సర్కార్ కట్టుబడి ఉందన్నారు. ఈ సందర్భంగా మల్ రెడ్డిని టీచర్లు ఘనంగా సన్మానించారు.



# ప్రభుత్వం వెంటనే సింగరేణి సంస్థకు చెందిన బకాయిలు చెల్లించాలి

- మాజీ ఎమ్మెల్యే , బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అమ్మరాజుల శ్రీదేవి

**బెల్లంపల్లి, మహా:** రాష్ట్ర ప్రభుత్వం నుండి సింగరేణికి రావాల్సిన బకాయి నిధులను వెంటనే చెల్లించాలని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే ,బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అమరాజుల శ్రీదేవి డిమాండ్ చేశారు.ఆదివారం నాడు బిజెపి సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలను ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే చెల్లించాలని కార్మికుల సమస్యలపై ఈ నెల 30న సీసీసీ కార్నల్ లో ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ధర్నా కార్యక్రమనికి భాజపా రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు, మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు, ఈటల రాజేందర్, శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి హాజరవుతాని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం నుంచి సింగరేణి సంస్థకు రావాల్సిన రూ. 55 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని, సంబంధిత నిధులతో సింగరేణి ఆర్థిక బలోపేతంతో పాటు సంస్థ అభివృద్ధి, కార్మికుల సంక్షేమానికి కీలకమని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ ఆర్థికంగా బలోపేతం కావడంతో పాటు కార్మికుల సంక్షేమం, భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని ,సింగరేణి కార్మికుల హక్కులు, సంక్షేమం, భద్రత కోసం ఆరు ప్రధాన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని,2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సింగరేణి వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించి, అందులో 40 శాతం వాటాను కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికుల శ్రమకు తగిన గుర్తింపుగా లాభాల్లో న్యాయమైన వాటా అందించాలన్నారు.కార్మికులకు మెడికల్ బోర్డు విషయంలో జాప్యం లేకుండా ప్రతి నెల మూడు మెడికల్ బోర్డులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎలాంటి అక్రమాలు, అన్యాయాలకు తావులేకుండా పారదర్శకంగా అర్హులైన కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.కార్మికుల సొంత ఇంటి కళ ను నెరవేర్చేందుకు రెండు గుంటల స్థలం కేటాయించి, ఇల్లు నిర్మించుకునేందుకు బ్యాంకు రుణ సదుపాయం కల్పించాలని,కార్మికుల ప్రాణ భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని,అవసరమైన పనిముట్లు, హెల్మెట్లు, సేఫ్టీ షూస్, ఇతర భద్రతా పరికరాలను నాణ్యతతో సకాలంలో అందించాలని,డిస్మిస్ అయిన కార్మికుల కేసులను మానవతా దృక్పథంతో, నిబంధనలకు అనుగుణంగా పునఃపరిశీలించి, అర్హత ఉన్న కార్మికులకు మరో అవకాశం కల్పించాలని "కార్మికుల శ్రమకు గౌరవం - హక్కులకు రక్షణ - కుటుంబాలకు భద్రత" అనే లక్ష్యంతో సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి బీజేపీ పార్టీ నిరంతరం పోరాడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి ఎర్రోజు శ్రీనివాస్ సీనియర్ నాయకులు మద్దెర్ల శీనివాస్ ,దూది ప్రకాష్,జిల్లా నాయకురాలు నల్లుల సంగీత, పట్టణ ఉపాధ్యక్షులు గాండ్లమహేష్, పుల్లూరి రాము, పట్టణ కార్యదర్శులు గంధం అనిల్, అల్లకటి మహేష్, యువ మోర్చా అధ్యక్షులు తోటపల్లి ఓం సాయి, ఎస్సీ మోర్చా అధ్యక్షులు ఇప్ప స్వామి, మైనార్టీ మోర్చా అధ్యక్షులు షేక్ గౌస్ బాబా, ఎస్టి మోర్చా అధ్యక్షులు బానోతు సంతోష్, పుల్ల ప్రశాంత్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు

# హనుమాన్ ఆలయంలో చోరీ

**హుండీ నుంచి నగదు దోపిడీ**

**పరకాల,మహా** ; హనుమకొండ జిల్లా, పరకాల మండలం, మల్లక్కపేట హనుమాన్ ఆలయంలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలోని హుండీ నుంచి నగదు దోపిడీ చేసినట్లు తెలుస్తోంది. అర్ధరాత్రి వేళ ఆలయంలోకి చొరబడిన దుండగులు హుండీ తాళాలు బద్దలుకొట్టి నగదు ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం అర్చకుడు, సిబ్బంది ఆలయానికి వచ్చాక చోరీని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలాన్ని పరిశీలించి ఈ ఘటనకు పాల్పడ్డ దుండగుల కోసం పోలీసుల బృందం గాలిస్తున్నారు. ఆలయంలోని సీసీటీవీ కెమెరాలు సరిగ్గా పని చేయకపోవడంతో పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.





# కొండ లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి

**క్యాతనపల్లి మహా :** ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా క్యాతనపల్లి మున్సిపాలిటీ పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బి జోన్ సెంటర్‌లోని శ్రీలక్ష్మి గణేష్ మండలి వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు వనం సత్యనారాయణ మాట్లాడుతూ.. క్విట్ ఇండియా ఉద్యమం, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమాల్లో కొండ లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. అనంతరం యోగా, బ్రూస్లీ రంగాల్లో అవార్డులు, పతకాలు సాధించిన రామకృష్ణాపూర్‌కు చెందిన గోరంట్ల గీతాదేవి-దేవేందర్ దంపతులను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆడెపు తిరుపతి, వేముల వెంకటేశం, కొండ కుమార్, ఇప్పకాయల లింగయ్య, బూర సారంగపాణి, ఆడెపు లక్ష్మణ్ ఇతర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# అసత్య ఆరోపణలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

**...బెల్లంపల్లి మున్సిపల్ చైర్పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు**

**బెల్లంపల్లి, మహా**: కాంగ్రెస్ పార్టీలో చేరాలని ఒత్తిడి చేశారనే అసత్య ఆరోపణలుచేసిన బిఆర్ఎస్ పార్టీకి చెందిన 6వ వార్డు కౌన్సిలర్ సల్ల రజిత సోషల్ మీడియా వేదికగా తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో చట్టపరమైన చర్యలను తీసుకోవడం జరుగుతుందని బెల్లంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు పేర్కొన్నారు . ఆదివారం నాడు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో చైర్పర్సన్ తో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు వార్డు కౌన్సిలర్ పాల్గొన్నారు. ఆమె ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డు కౌన్సిలర్ రజిత తనపై,తన భర్త దావ రమేష్ బాబు పై చేసిన అసత్య ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నాను ని, ఆరోపణలకు రుజువులు ఉంటే చూపిస్తుందేమో అని ఒక రోజు సమయం ఇవ్వడం జరిగినా ఇంతవరకు కౌన్సిలర్ చేసిన ఏ ఒక్క ఆరోపణకు ఆధారాలు చూపలేదుని వెల్లడించారు.6వ వార్డ్ ఆర్పీ కి సంబంధించి విషయంలో మాకు ఎం సంబంధం ఉంటుందని, అది పూర్తిగా మెప్మా విభాగనికి సంబందించిన విషయం అని గుర్తు పెట్టుకోవాలని, సదరు ఆర్పీ విషయంలో మెప్మాఅధికారులు గత కొన్ని నెలలుగా విచారణ జరిపించి, చర్యలు తీసుకోవడం జరిగిందని,ఆర్పీ విషయంలో తమ ప్రమేయం ఉన్నట్లు ఆధారాలు ఉంటే నిరూపించాలని డిమాండ్ చేశారు. కౌన్సిలర్ రజితను కాంగ్రెస్ పార్టీలోకి రావాలని తన భర్త ఒత్తిడి చేశాడని, బెదిరించాడని చేసిన ఆరోపణలు పూర్తిగా అసత్యం..వాటికి సంబందించి ఏ ఒక్క ఆధారం చూపెట్టిన మేము ఎలాంటి చర్యలకైనా సిద్ధంగా ఉన్నామని,రాజకీయంగా ఎదురుకోలేక అసత్య ఆరోపణలు చేస్తున్నారని వెల్లడించారు.కౌన్సిలర్ రజిత కు మరొక రోజు సమయం ఇస్తున్నామనీ, ఆమె చేసిన ఆరోపణలు నిరూపించాలనో, లేని పక్షంలో ఆమెపై తీసుకునే న్యాయ పరమైన చర్యలకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. బెల్లంపల్లి మున్సిపల్ పాలకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన మెజారిటీ ఉందని టిఆర్ఎస్ పార్టీకి చెందిన వార్డు కౌన్సిలర్ల మద్దతు తమ పార్టీకి అవసరం లేదని స్వచ్ఛందంగా వచ్చినప్పటికీ తమ పార్టీ ఆరో వార్డు కౌన్సిలర్ ను చేర్చుకునే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. అసత్య ఆరోపణలు చేయడానికి కేటాయించే సమయాన్ని ఎన్నికలలో ఓట్లు వేసి గెలిపించిన వార్డ్ ప్రజల సంక్షేమం,వార్డ్ అభివృద్ధికై దృష్టి సారిస్తే బాగుంటుందని హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి బెల్లంపల్లి పట్టణ అభివృద్ధికి మున్సిపల్ పాలకవర్గం తీవ్రంగా శ్రమిస్తుందని గుర్తు చేశారు . ఈ సందర్భంగా పలువురు వార్డు కౌన్సిలర్లు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యే పై గానీ, కాంగ్రెస్ పార్టీ నాయకులపై గాని అసత్య ఆరోపణలు చేస్తే ఇకపై సహించబోమని ఇప్పటికైనా సోషల్ మీడియా వేదికగా బహిరంగ క్షమాపణలు ప్రకటించాలని పలువురు కాంగ్రెస్ వార్డు కౌన్సిలర్లు ఎండి నిజాం, చింతల వసంత, ఢీకొండ, పద్మావతి, కంకటి ప్రణీత ,నిచకోల వంశీకృష్ణ, జంగం కల్పన , దామెర విజయలక్ష్మిలు సమిష్టిగా డిమాండ్ చేశారు.





# 12వ వేతన ఒప్పందంపై కేంద్ర ప్రభుత్వ వైఖరి తెలపాలి

- మందమర్రి ఏరియా సీఐటీయూ నేతల డిమాండ్

**మందమర్రి, మహా :** బొగ్గు గని కార్మికుల 12వ వేతన ఒప్పందంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) డిమాండ్ చేసింది. మందమర్రిలోని యూనియన్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో డిప్యూటీ జనరల్ సెక్రటరీ అల్లి రాజేందర్, బ్రాంచ్ అధ్యక్షులు ఎస్. వెంకటస్వామి మాట్లాడారు. వేతన కమిటీ గడువు ముగిసి మూడు నెలలు దాటినా కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి స్పందించకపోవడం సరికాదన్నారు. సింగరేణి నుంచి డివిడెండ్ తీసుకుంటున్న కేంద్ర ప్రభుత్వం, సంస్థ బకాయిలపై నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. లాభాల నుంచి వచ్చే డివిడెండ్‌ను సింగరేణికే కేటాయించి సంస్థను ఆర్థికంగా బలోపేతం చేయాలని కోరారు.కార్మికుల సీఎంపీఎఫ్ ఖాతాలను అక్టోబర్ నెలలోగా అప్‌డేట్ చేయకుంటే సీఎంపీఎఫ్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్మికులకు నాణ్యమైన బూట్లు, వాన కోట్లు ఇవ్వడంలో యాజమాన్యం విఫలమైందన్నారు. త్వరలో ఏరియాలో యూత్ కమిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. సమావేశంలో బుద్ధ సురేష్, భేతి భరత్, నాగవల్లి శ్రీధర్ తదితర నాయకులు పాల్గొన్నారు.



# ఆధునిక ఫ్రూట్ మార్కెట్ ఏర్పాటు

**స్థల పరిశీలన చేసిన కలెక్టర్, ఎమ్మెల్యే, మార్కెట్ చైర్మన్**

**వరంగల్, గీసుగొండ ;** రైతులు, వ్యాపారుల అవసరాలకు అనుగుణంగా ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో ఆధునిక ఫ్రూట్ మార్కెట్ ఏర్పాటుకు ఆదివారం స్థల పరిశీలన చేశారు. గీసుగొండ మండలం విశ్వనాథపురం గ్రామ పరిధిలో ప్రతిపాదిత స్థలాన్ని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ పులి ప్రియాంక సంబంధిత అధికారులు పరిశీలించారు. రైతులకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడం, పండ్ల ఉత్పత్తుల విక్రయానికి అనువైన మౌలిక వసతుల ఏర్పాటు చేయడం, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మార్కెట్ ను అభివృద్ధి చేయడం లక్ష్యంగా స్థల పరిశీలన చేశారు. ప్రతిపాదిత స్థలంలోని విస్తీర్ణం, రహదారి, రవాణా, మౌలిక వసతుల తో పాటు భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని మార్కెట్ అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్ కుమార్, వరంగల్ ఆర్డీవో సుమ,జిల్లా ల్యాండ్ సర్వే, రికార్డ్స్ అధికారి శ్రీనివాసులు, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, మార్కెటింగ్ డైరెక్టర్ రుద్రప్రసాద్, మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.

# అక్టోబర్ 12 నుంచి శ్రీవారి ఉత్సవాలు

**తిరుమల, మహా:** తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 12 నుంచి 20వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు వైభవంగా జరగనున్నాయి. అధిక మాసం కారణంగా ఈ ఏడాది రెండోసారి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్న టీటీడీ భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తోంది. అక్టోబర్ 11న అంకురార్పణతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. ప్రతిరోజూ ఉదయం, రాత్రి స్వామివారు వివిధ వాహనాలపై మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. అక్టోబర్ 16న గరుడ వాహన సేవ సాయంత్రం 6.30 నుంచి రాత్రి 11.30 గంటల వరకు నిర్వహించనున్నారు. 20న ఉదయం 6 గంటలకు చక్రస్నానంతో ఉత్సవాలు ముగుస్తాయి. నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణం, పెద్ద రథం, ధ్వజావరోహణం వంటి కార్యక్రమాలు ఉండవని టీటీడీ తెలిపింది.

మహా పత్రిక

WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | సోమవారం, హైదరాబాద్ | 28-09-2026

# బీచ్‌వేర్‌లో జ్యోతి పూర్వజ్ గ్లామర్

**సినిమాబ్యూరో, మహా:** 'గుప్పెడంత మనసు' సీరియల్‌లో జగతి పాత్రతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన నటి జ్యోతి పూర్వజ్ మరోసారి తన స్టైలిష్ లుక్‌తో ఆకట్టుకుంటున్నారు. తాజాగా సముద్ర తీరంలో నిర్వహించిన ఫొటోషూట్‌కు సంబంధించిన చిత్రాలను ఆమె సోషల్ మీడియాలో పంచుకున్నారు. పింక్ బీచ్‌వేర్, ఫ్లోరల్ ప్రింట్ సారంగ్, షీర్ కవర్‌అప్‌తో కనిపించిన ఆమె లుక్‌కు అభిమానుల నుంచి స్పందన వస్తోంది. సముద్రం, నీలిరంగు నీటి నేపథ్యానికి అనుగుణంగా సన్‌గ్లాసెస్, వేవీ హెయిర్‌స్టైల్‌తో జ్యోతి ప్రత్యేకంగా కనిపించారు. టెలివిజన్ రంగంలో మంచి గుర్తింపు తెచ్చుకున్న జ్యోతి పూర్వజ్ ప్రస్తుతం సినిమాలపై దృష్టి సారిస్తున్నారు. కన్నడ, తులు భాషల్లో పలు చిత్రాల్లో నటించిన ఆమె 'కిల్లర్' వంటి ప్రాజెక్టులతో వెండితెరపై తన పరిధిని విస్తరిస్తున్నారు. 'గుప్పెడంత మనసు'లో జగతి పాత్ర ఆమెకు తెలుగు ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చింది. సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉండే జ్యోతి తరచూ తన ఫ్యాషన్, ఫిట్‌నెస్, ఫొటోషూట్‌లకు సంబంధించిన చిత్రాలను అభిమానులతో పంచుకుంటుంటారు. తాజాగా బీచ్ లుక్‌లో ఆమె ఇచ్చిన పోజులు నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.






# వెంకటేష్‌పై త్రివిక్రమ్‌కు ప్రత్యేక గౌరవం

సినిమాబ్యూరో, మహా: విక్టరీ వెంకటేష్, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం' చిత్రంపై సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. సినిమా ప్రమోషన్‌లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో త్రివిక్రమ్ వెంకటేష్‌తో తనకున్న అనుబంధం గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. సినీ ప్రయాణం ప్రారంభమైన సమయంలోనే వెంకటేష్‌తో పరిచయం ఏర్పడిందని, ఆయన సినిమాలకు పనిచేసే అవకాశం రావడం తన కెరీర్‌లో ప్రత్యేకమైన అనుభవమని చెప్పారు. వెంకటేష్‌తో చాలా కాలంగా స్నేహపూర్వక సంబంధం ఉన్నప్పటికీ, ఆయనను కలిసిన ప్రతిసారీ తనలో గౌరవంతో కూడిన ఒక ప్రత్యేకమైన భావన ఉంటుందని త్రివిక్రమ్ పేర్కొన్నారు. నటుడిగా వెంకటేష్ చూపించే అంకితభావం, సినిమా పట్ల ఆయనకున్న ఆసక్తి తనను ఎప్పటికప్పుడు ఆకట్టుకుంటాయని తెలిపారు. వయసు పెరుగుతున్న కొద్దీ సినిమా పట్ల ఆయన ఉత్సాహం మరింతగా కనిపిస్తోందని చెప్పారు. తన కెరీర్ తొలినాళ్లలో వెంకటేష్ నటించిన పలు చిత్రాలకు రచయితగా పనిచేసిన త్రివిక్రమ్.. ఆ పరిచయం కాలక్రమేణా మంచి అనుబంధంగా మారిందని గుర్తుచేసుకున్నారు. ఇప్పుడు చాలా కాలం తర్వాత వీరిద్దరూ కలిసి పనిచేస్తుండటంతో అభిమానుల్లోనూ అంచనాలు పెరిగాయి. 'ఆదర్శ కుటుంబం' కథ, వెంకటేష్ పాత్ర, త్రివిక్రమ్ రచనపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను చిత్రబృందం త్వరలో వెల్లడించనుంది.





# ఓటీటీలోకి రూ.325 కోట్ల మలయాళ బ్లాక్‌బస్టర్

సినిమాబ్యూరో, మహా: మలయాళంలో భారీ విజయాన్ని అందుకున్న 'బెత్లహేమ్ కుటుంబ యూనిట్' చిత్రం ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. నివిన్ పౌలి, మమితా బైజు ప్రధాన పాత్రల్లో నటించిన ఈ రొమాంటిక్ కామెడీ చిత్రం గిరీష్ ఏడీ దర్శకత్వంలో తెరకెక్కింది. ఆగస్టు 21న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధించింది. ప్రపంచవ్యాప్తంగా రూ.325 కోట్లకు పైగా గ్రాస్ రాబట్టినట్లు పలు నివేదికలు పేర్కొంటున్నాయి. సాధారణమైన కథాంశాన్ని కుటుంబ అనుబంధాలు, ప్రేమ, హాస్యంతో మేళవించి తెరకెక్కించిన ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. నివిన్ పౌలి పోషించిన జస్టిన్, మమితా బైజు నటించిన ఆష్లే పాత్రల చుట్టూ కథ ప్రధానంగా సాగుతుంది. వీరిద్దరి మధ్య ఏర్పడే పరిచయం, దాని చుట్టూ చోటుచేసుకునే పరిణామాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. తెలుగుతో పాటు తమిళంలోనూ ఈ సినిమా సెప్టెంబర్ 4న విడుదలైంది. థియేట్రికల్ రన్ తర్వాత ఈ సినిమా డిజిటల్ ప్రీమియర్‌కు సిద్ధమైంది. జియో హాట్‌స్టార్‌లో అక్టోబర్ 2 నుంచి స్ట్రీమింగ్ కానుంది. మలయాళంతో పాటు తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లోనూ అందుబాటులోకి రానుంది. ఫహాద్ ఫాజిల్, దిలీష్ పోతన్, శ్యామ్ పుష్కరన్ కలిసి భవన స్టూడియోస్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మించారు.

# స్టైలిష్ లుక్‌లో అనీత్ పడ్డా

సినిమాబ్యూరో, మహా: బాలీవుడ్ యువ నటి అనీత్ పడ్డా తన తాజా ఫొటోషూట్‌తో మరోసారి అభిమానుల దృష్టిని ఆకర్షించారు. బ్రౌన్ టోన్లలో రూపొందించిన కార్సెట్ తరహా టాప్, దానికి సరిపోయే ఫ్లేర్డ్ ప్యాంట్‌లో ఆమె స్టైలిష్‌గా కనిపించారు. మినిమల్ యాక్సెసరీస్‌తో పాటు సహజమైన మేకప్, షార్ట్ హెయిర్‌స్టైల్ ఆమె లుక్‌కు మరింత ఆకర్షణను తీసుకొచ్చాయి. వివిధ పోజుల్లో కెమెరాకు ఫొటోలు ఇస్తూ యూత్‌ఫుల్ ఎనర్జీని ప్రదర్శించారు. 'సైయారా' చిత్రంతో అనీత్ పడ్డాకు మంచి గుర్తింపు వచ్చింది. అంతకుముందు 'సలామ్ వెంకీ'లో చిన్న పాత్రలో కనిపించిన ఆమె, 'బిగ్ గర్ల్స్ డోంట్ క్రై' వెబ్‌సిరీస్‌తో నటిగా మరింత గుర్తింపు తెచ్చుకున్నారు. 2025లో విడుదలైన 'సైయారా'లో వాణి బాత్రా పాత్రలో నటించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. తాజా ఫొటోషూట్‌లో అనీత్ పడ్డా ఎంచుకున్న బ్రౌన్ కలర్ థీమ్ రెట్రో ఫ్యాషన్‌ను గుర్తు చేస్తోంది. సింపుల్ స్టైలింగ్‌తోనే ప్రత్యేకంగా కనిపించేలా ఆమె లుక్‌ను డిజైన్ చేశారు. ప్రస్తుతం ఆమె నటిగా వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. 'హుంకార్: ది రోర్', 'శక్తి శాలిని' వంటి ప్రాజెక్టులు ఆమె తదుపరి సినిమాలుగా ఉన్నాయి.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com